

నూతనంగా ఏర్పాటు చేసిన పారిశుధ్య కార్మికుల మొబైల్ టీమ్‌తో డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్

పారిశుధ్య కార్మికులతో..
మొబైల్ టీమ్

- జిల్లాలో కొత్త కార్యక్రమానికి శ్రీకారం

ఏలూరు సిటీ, సెప్టెంబరు 6 : పారిశుధ్య నిర్వహణలో ఏలూరు జిల్లా కొత్తతరహా కార్యక్రమానికి నాంది పలికింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పారిశుధ్య కార్మికులతో మొబైల్ టీం ఏర్పాటు చేసి జిల్లాలో అవసరమైన చోట్ల కార్మికుల సేవలను వినియోగించుకునేలా ప్రణాళికలు తయారుచేసి పారిశుధ్య నిర్వహణ జిల్లావ్యాప్తంగా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న మొబైల్ పారిశుధ్య కార్మికుల టీంలో 13 మంది ఎలక్ట్రీషియన్స్, ఇద్దరు ప్లంబర్లు, ఇద్దరు ట్యాంక్ ఆపరేటర్లు, 6 గురు శానిటేషన్ కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్ ఉంటారు. జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించనున్న ఈ టీం సభ్యులు అత్యవసర సమయంలో జిల్లాలో ఉన్న 547 పంచాయతీల్లో సేవలు అందిస్తారు. కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో అనేక గ్రామాలు నీట మునిగాయని ఆయా గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల మొబైల్ టీం సేవలు వినియోగంలోకి తీసుకొస్తున్నామని డీపీవో తెలిపారు.

గణేశ్ మహరాజ్‌కీ జై..



ఏలూరులో అమ్మకానికి సిద్ధంగా..

తొలిపూజ అందుకునే గణనాథుడి ఉత్సవాలకు వేళయింది. శనివారం వినాయక చవితి సందర్భంగా జిల్లాలో వాడవాడలా నవరాత్రుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వినాయక ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా చవితి సందర్భంగా శుక్రవారం ఏలూరుతో పాటు ఇతర పట్టణాల్లో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. మట్టి బొమ్మలతో పాటు రంగు రంగుల గణనాథుడి ప్రతిమలు అమ్మకానికి ఉంచారు. పూలు, పత్రి, పండ్ల ధరలు చుక్కలనంటాయి.



కొల్లేరు.. ఆగమాగం
అంతులేని రాజకీయ ఆక్రమణలు

- ఎవరు అధికారంలో ఉంటే వారిదే రాజ్యం
- సరస్సు అంతర్భాగంలో ఆక్రమణల వల్లే నేడు ఈ దుస్థితి
- బుడమేరు వరదతో అసలు రహస్యం బట్టబయలు
- తిలా పాపం.. తలా పిడికెడు అన్నట్టుగా కమీషన్లమయం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఇంతకాలం అంతా కొల్లేరే కదా అనుకున్నారు. వాగులు, వంకలు పొంగితే ఆ నీరంతా పోవడానికి ఇదొక కాసారం అనుకున్నారు. కోర్టు ఆదేశాలు ధిక్కరించి రాజకీయ ముసుగులో ఎంచక్కా కొల్లేరు భూమిని కాజేయాలని ఇంకొందరు కాచుకుకూర్చున్నారు. మరికొందరైతే కొల్లేరు కబ్జా చేశారు. మూడు టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్న కొల్లేరు కాస్తా ఇప్పుడు బుడమేరు పుణ్యమా అని రెండు టీఎంసీల నీటితోనే ఉక్కిరిబిక్కిరి అవుతోంది. లంక గ్రామాల్లో వేలాది మంది విలవిలాడుతున్నారు. చుట్టూ కమ్ముకొస్తున్న వరదనీరు ఒకవైపు, ఎన్నడూ లేని విధంగా రోడ్లపై రెండున్నర అడుగుల మేర నీటి ప్రవాహం చేరింది. కొల్లేరులో నిత్యం మేతకు వెళ్లే వందలాది పశువులు మూడు రోజులుగా పాకలకే పరిమితమయ్యాయి. రోజువారీ చిన్నాచితక చేపల వేటతో బతుకీడ్చుకొచ్చే వారు సైతం ఇప్పుడు ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. అసలు ఇంతకీ కొల్లేరు ఎందుకిలా ఆగమాగమైంది.

అంతా పాలకుల పుణ్యమే..

ఒకనాడు బుడమేరు పొంగినా, ఎర్రకాల్వ ఉప్పొంగినా, తమ్మిలేరు ఉరకలేసినా, రామిలేరు ఉధృతంగా ప్రవహించినా, కొండవాగులు పొంగినా ఆ నీరంతా కొల్లేరు వైపే పరుగులు తీసేది. చిన్నాచితక నీటి వనరుల నుంచి వానా కాలంలో పాయలు పాయలుగా వచ్చి ఇక్కడే చేరతాయి. దక్షిణాసియాలోనే మంచినీటి సరస్సుగా పేరొంది తర్వాత కబ్జా కోరల్లో చిక్కిశల్యమై ఆపై ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులే పెత్తనం చెల్లాయించేవారు. దరిమిలా కొల్లేరును నమ్ముకుని బతుకీడ్చుకొస్తున్న వేలాది మంది గడిచిన 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. వాగులు, వంకల నుంచే కాదు చివరకు ఏలూరు నగరం నుంచి కూడా మురుగునీరంతా ఈ సరస్సులోకే. అంతలా సరస్సు సహజ స్వరూపాన్ని దెబ్బ తీశారు. చేపల చెరువుల పేరిట దాదాపు 11 అడుగుల ఎత్తున కోట గోడలు నిర్మించినట్టు ఎక్కడికక్కడ కట్టలు వేసి ప్రవాహ వేగానికి అడ్డుగా నిలిచారు. దీనిని గమనించే సుప్రీం సాధికార కమిటీ పర్యావరణ పరిరక్షణే కాదు కొల్లేరు సహజ రూపు తిరిగి ఇవ్వాల్సిందేనని సంకల్పించి కార్యాచరణ సిద్ధం చేసింది. 2005లో కొల్లేరు ఆపరేషన్ జరగ్గా 56 వేల ఎకరాల్లో అక్రమంగా తవ్విన చెరువులను ధ్వంసం చేశారు. మిగిలిన చెరువులను అడ్డంగా తొలగిస్తామంటూ అధికారులు బీరాలు పోయారు. ఇదంతా జరిగి 20 ఏళ్లు కావొస్తోంది. కాని ఈలోపే అధికారంలో ఎవరు ఉంటే వారిదే రాజ్యం. ఆ పార్టీలకు చెందిన నేతలంతా కొల్లేరుపై వాలిపోతారు. దళారులు ఇక్కడే. బ్లాక్ మెయిలర్స్‌కు ఆవాసం ఇక్కడే. 2020లో ఎర్రకాల్వ, తమ్మిలేరు నుంచి వరద వచ్చినప్పుడు దానికి బుడమేరు తోడు కావడంతో ఏలూరు-కైకలూరు మార్గమంతా జలమయమైంది. దీనికితోడు కొల్లేరు అంతర్భాగంలో పెరిగిన సిల్టు మరో కారణం. ఉప్పుటేరు నుంచి చొచ్చుకొచ్చే సముద్ర జలాలు మంచి నీటి సరస్సు అసలు సిసలైన స్వరూపాన్ని దెబ్బతీశాయి. సరస్సు పరీవాహకంలో ఉప్పు నీరు చేరింది. దీనికితోడు కొల్లేరును అభయారణ్యంగా ప్రకటించినా దిక్కుమొక్కులేదు. విదేశీ పక్షుల ఆవాసం పోయి ఇక్కడ నిత్యం రాజకీయ పక్షుల సందడే ఎక్కువ. అధికారులు చూసీచూడనట్టుగా కొల్లేరులో అక్రమ చెరువుల తవ్వకాలను ఎప్పుడూ వదిలేస్తూనే ఉంటారు.

చంద్రబాబు ఆరా

జిల్లాలో వరద నీటి ప్రవాహం ఏ స్థాయిలో ఉంది, ప్రత్యేకించి కొల్లేరు, గోదావరి వరదలపై తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఆరా తీశారు. కలెక్టర్ వెట్రి సెల్వితో ఆయన మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో బుడమేరు, ఇతర వాగుల నుంచి వచ్చిన వరద కొల్లేరులో కలుస్తోందని, దీంతో కొల్లేరు ప్రాంతంలో వరద నీరు పూర్తిగా చేరిందంటూ కలెక్టర్ సీఎం దృష్టికి తెచ్చారు. బుడమేరు వరద కొల్లేరులో ప్రభావితం చేసిందని, దీంతో యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి తగు చర్యలు చేపడుతున్నామని వివరించారు. కొల్లేరు అంతర్భాగంలో ఉన్న పరిస్థితులను స్వయంగా వెళ్లి అంచనా వేశామని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని, పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

కమీషన్లు.. కక్కుర్తి

ఈ మధ్యకాలంలోనే లక్షలకు ప్రజాప్రతినిధులు కక్కుర్తిపడ్డారు. సొసైటీ చెరువుల్లో సొమ్మును తమ వద్ద రిజర్వు చేస్తే ఆ తర్వాత సొమ్మునంతా సక్రమ పద్ధతిలో పంచుతామని ఎర వేశారు. తీరా అసలు విషయానికి వచ్చేసరికి రూపాయి రెండు రూపాయలు కాదు.. లక్షల్లోనే సొమ్మంతా కొందరి చేతుల్లోకి చేరింది. ఎన్నికల సమయంలోనే ఇదంతా సాగింది. ఎలాగూ అధికారం ఉంది కాబట్టి అప్పట్లో అంతా తామే చూసుకుంటామంటూ కొందరు పెద్దలను ఒప్పించి మరీ తాము అనుకున్నట్టుగా వ్యవహారం చక్కబెట్టే ప్రయత్నం చేశారు. ఎన్నికలు పూర్తవడం, ఫలితాలు కాస్తా తిరగబడడంతోనే మా సొమ్ము మాకు ఇచ్చేయండంటూ కొల్లేరువాసులు వైసీపీ నేతల ఇళ్లపై దండెత్తారు. కావాలనే తమ సొమ్మును చేజిక్కించుకోవడంతో పాటు ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకున్నారంటూ కన్నెర్ర చేశారు. కొల్లేరును వైసీపీ ఏ రూపంలో దోపిడీ చేసిందో టీడీపీ కూడా ప్రజలకు వివరించే ప్రయత్నం చేసింది. దీనికితోడు కొంత మంది అధికారులకు కొల్లేరు బంగారు బాతే. వారికి ఎప్పటికప్పుడు 'పండగ' మామూళ్లు ఇస్తూనే ఉంటారు. దీంతో అక్రమ చెరువుల తవ్వకానికి అడ్డే లేకుండా పోయింది. కేసులు నమోదు చేశామని, వాహనాలను సీజ్ చేశామని అటవీశాఖ ఎప్పటికప్పుడు లెక్క చెబుతూనే వచ్చింది. తమ కనుసన్నలు దాటి ఎవరూ చెరువులు తవ్వలేరంటూ ధీమాగా చెబుతూ వచ్చింది. కాని జరగాల్సింది అంతా జరుగుతూనే ఉంది. దెందులూరు, ఏలూరు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలో కొల్లేరు అంతర్గత భూభాగంలో ఎక్కడికక్కడ కబ్జా అయ్యింది.



చినయడ్లగాడి వద్ద ఏలూరు-కైకలూరు మార్గంపై కొల్లేరు వరద

బుడమేరు బుసబుసలాడితేనే.. ?

బుడమేరు ఉగ్రరూపం దాల్చి విరుచుకుపడడం ఒక్క విజయవాడ నగరాన్నే దిగ్భ్రాంతి పర్చలేదు.. ఆఖరుకి కొల్లేరును సైతం గడగడలాడించింది. బుడమేర వరద కొల్లేరుకే చేరుకుంటుంది. గతంలో ఈ సీజన్‌లో కాస్తో కూస్తో నీరు మాత్రమే కొల్లేరులోకి వచ్చిపడేది. అలాంటిది కొల్లేరుకు నలుదిక్కులా ఉన్న జల వనరుల నుంచి మహోగ్ర వరద విరుచుకుపడుతూ వచ్చింది. బుడమేరు తాకిడితో కొల్లేరు కిటకిటలాడింది. ఈ సరస్సు సామర్థ్యం మూడు టీఎంసీలుగా ఇరిగేషన్ అధికారులు నిర్ధారించారు. తాజాగా ఇప్పుడు బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు, ఎర్ర కాల్వతో పాటు మరికొన్ని డ్రెయిన్ల ద్వారా వస్తున్న నీరు రెండు టీఎంసీలకు మించి ఉండదని అంచనా వేశారు. అయినా కొల్లేరు ఇప్పుడు ఎటుచూసినా వరద నీటితో ఉరకలు వేస్తోంది. ఆఖరుకి పెద్ద ఎడ్లగాడి, చిన్న ఎడ్లగాడి ప్రాంతాల్లో రోడ్డు మార్గంపై భారీగా వరద నీరు పారుతోంది. ఐదేళ్ల క్రితం ఇలాంటి తరహా పరిస్థితులే నెలకొన్నా ఇప్పుడు బుడమేరు దూకుడు (మిగతా 7లో)



రైల్వేబ్రిడ్జిపై నుంచి ఉప్పుటేరును పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ శివకిశోర్

ఉప్పుటేరులోని అడ్డంకులు తొలగించండి : కలెక్టర్

కైకలూరు/మండవల్లి/ఏలూరు రూరల్ : ఉప్పుటేరులో వరదనీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టిదిబ్బలు, కిక్కిసక్రర, గుర్రపుడెక్క వాటిని తక్షణమే తొలగించాలని అధికారులను కలెక్టర్ వెట్రీ సెల్వీ ఆదేశించారు. కైకలూరు మండలం ఆలపాడు శివారు సోమేశ్వరం వద్ద ఉప్పుటేరును ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, కైకలూరు కూటమి నేతలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కొల్లేరు ముంపు, ఉప్పుటేరు ఆక్రమణలపై టీడీపీ రాష్ట్ర వడ్డీసాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు కలెక్టర్‌కు వివరించారు. ఉప్పుటేరులోని అడ్డంకులను అధికారులు తక్షణమే తొలగించాలని రహదారుల, భవనాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, ఆర్డీవో కాజావలీ, డీఎస్పీ శ్రావణకుమార్ పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ఉప్పుటేరుపై రైల్వే వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను పరిశీలించేందుకు వెళ్లిన కలెక్టర్‌కు, ఎస్పీలకు ప్రమాదం తృటిలో తప్పింది. వీరు ఇద్దరు ట్రాక్‌పైకి వెళ్ళే సరికి బొకారో ఎక్స్ ప్రెస్ వచ్చింది. రైల్వే సిబ్బంది వారిని అప్రమత్తం చేయడంతో వెంటనే ట్రాక్ పక్కనే ఉన్న స్థలంలోకి దిగడంతో ప్రమాదం తప్పింది.

రహదారులు జలదిగ్బంధం

కొల్లేరు ఉగ్రరూపంతో లంకగ్రామాల రోడ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండవల్లి మండలంలోని పెనుమాకలంక, నందిగామలంక, ఇంగిలిపాకలంకతో పాటు ఉనికిలి, నుచ్చుమిల్లి, తక్కెళ్ళపాడు, కొవ్వాడలంక గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. కైకలూరు నుంచి ఏలూరు వెళ్లే రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో పికెట్‌లను ఏర్పాటు చేశారు. కొవ్వాడలంక వరద పరి స్థితిని కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్, ఏలూరు ఆర్డీవో ఖాజా వలీ పరిశీలించారు. ఏలూరు రూరల్ మండలంలోని మొండికోడు, గుడివాకలంక గ్రామాలకు వెళ్లే రహదారిపై వరద పొంగిపొర్లుతుండడంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. దీంతో కొవ్వలి మీదుగా ఆగడాలలంక నుంచి ఆ గ్రామాలకు చేరుకుంటున్నారు.



వేలేరుపాడులో నీటమునిగిన పంటపొలాలు

శాంతించిన గోదావరి

- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

పోలవరం/కుక్కునూరు/వేలేరుపాడు, సెప్టెంబరు 6 : గోదావరి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 42 అడుగులకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్ వద్ద నీటిమట్టం 89.80 మీటర్లు నమోదు కాగా 360 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు రిజర్వాయర్ సిబ్బంది తెలిపారు. కొవ్వాడ రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. గోదావరి వరద జలాలు కడెమ్మ స్లూయిజ్ గేట్లను ముంచివేయడంతో కొండవాగుల జలాలు గోదావరిలోకి వెళ్లే మార్గంలేక పంటపొలాలు నీటిలోనే మునిగి ఉన్నాయి. సుమారు రెండు వేల ఎకరాల వరి పంట నీటమునిగింది. కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీలోని గొమ్ముగూడెం వరద బాధితులకు అధికారులు నిత్యావసర సరుకులు కూరగాయలు పంపిణీ చేశారు. గోదావరి వరద చుట్టుముట్టి రహదారులు మునిగిపోవడంతో బయటకు వచ్చే వీలులేక జనం ఇబ్బందులు పడుతున్న వేలేరుపాడు మండలం నాళ్ళవరం, తిరుమలాపురం గ్రామాల్లో జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య, డ్వామా పీడీ రాము పర్యటించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులను, వైద్య శిబిరాలను పరిశీలించారు. వారి వెంట వేలేరుపాడు, కొయ్యలగూడెం తహసీల్దార్‌లు పీవీ.సత్యనారాయణ, చల్లన్నదొర, తదితరులు ఉన్నారు.



కుక్కునూరు మండలం కివ్వాకలో నీటమునిగిన మిర్చి పంట

సాగుపై నీలినీడలు

- ఎడతెరిపిలేని వానలు.. వీడని వరదలు
- కుదేలవుతున్న వ్యవసాయ రంగం

విలీన ముంపు మండలాల్లో సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఏటా భారీ వర్షాలు ఆపై గోదావరి వరదలతో పంటలు వేసుకునేందుకు వీలు కాని పరిస్థితులు ఏర్పడడంతో సాగు ఆలస్యమవుతోంది. తద్వారా దిగుబడులపై ప్రభావం పడుతూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది జూలై నుంచి భారీ వర్షాలు, వరదలతో మండలం అతలాకుతలం అవుతోంది. జూన్‌లో పత్తి సాగుతో వ్యవసాయ సీజన్ ప్రారంభమై ఆగస్టు రెండో వారం నుంచి అపరాలు, వాణిజ్య పంటల సాగు, వరినాట్లు మొదలవుతాయి. వేలేరుపాడు మండలంలో జూన్‌లో చేపట్టిన పత్తిసాగు విడవకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతింది. పెదవాగు ఉధృతి కారణంగా పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి సాగుకు పనికి రాకుండా పోయాయి. సాగుకు పనికొచ్చే పొలాలకు సాగు నీరందించే పెదవాగు ప్రాజెక్టు కట్టతెగి నీరు లేకుండా పోవడంతో వరి సాగు చేసే అవకాశాలు లేకుండాపోయాయి. ప్రస్తుత వర్షాలు మండలాన్ని చుట్టుముట్టిన వరద కారణంగా అపరాలు, వాణిజ్య పంటలు, మిర్చి సాగు చేయడం సాధ్యం కాదు. వర్షాలు తగ్గి వరదలు తగ్గినా రైతులు తమ భూముల్లో పంటలు వేసుకునేందుకు మరో ఇరవై రోజుల పైనే పట్టే అవకాశం ఉంది. ఈలోగా మరలా వర్షాలు పడితే మరికొంతకాలం ముందుకు జరుగుతుంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఈ వ్యవసాయ సీజన్‌లో పంటలు సాగవుతాయా అన్న సందేహాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

200 ఎకరాల్లో నీటమునిగిన మిర్చి

కుక్కునూరు మండలంలో గోదావరి వరద మిర్చి రైతాంగాన్ని కష్టాల పాలు చేసింది. గత పదిహేను రోజులుగా గోదావరి తీర ప్రాంతంలో రైతులు మిర్చి మొక్కలు నాటారు. అనూహ్యంగా గోదావరి వరద 44 అడుగుల వరకు రావడంతో రైతులు వేసిన పంట నిండా మునిగింది. మండలంలో దాదాపు 200 ఎకరాల్లో మిర్చి మునిగింది. రైతులు ఎకరానికి రూ.50 వేలు కౌలు, మిర్చి మొక్క రూ.2చొప్పున కొనుగోలు చేయగా రూ.20 వేలు, మొక్కలు వేయడానికి, ఎరువులు వేయడానికి అదనంగా రూ.10 వేలు ఖర్చయింది. సెప్టెంబరు రావడంతో రైతులు ఇంకా గోదావరి రాదనే ఆలోచనతో మిర్చి సాగు ఆరంభించారు. కానీ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో అనూహ్యంగా గోదావరి నీటిమట్టం పెరిగి మిర్చి పంటంతా నీటమునిగింది. మొక్కలన్నీ చనిపోయే అవకాశం ఉందని మళ్లీ వేయాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క రైతు సుమారు రూ.30 వేలు నష్టపోయే పరిస్థితిది. ఇదిలా ఉండగా పంట వేసిన భూములన్నీ పోలవరం పరిహారం పొందిన భూములు కావడంతో ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదు చేయడం లేదు. దీంతో ఏటా రైతులు గోదావరి వరదలకు పత్తి, మిర్చి, వరి పంటలు కోల్పోతూ ఆర్థికంగా నష్టాలు చవిచూస్తున్నారు. గ్రామాల్లో ఉన్న నిర్వాసితులకు పునరావాస పరిహారం ఇచ్చి తరలించే వరకు భూములు సాగు చేసుకోవచ్చని నాడు ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఆ భూములు సాగు చేస్తున్న రైతులు పంట కోల్పోతే పరిహారం ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉధృతంగా బుడమేరు

- ముంపులో కొణికి, గోగుంట, ఆర్పీ పాలెం
- ఆందోళనలో గ్రామాల ప్రజలు

పెదపాడు : రామిలేరు శాంతించిందనుకుంటున్న తరుణంలో బుడమేరు వాగులో వరదనీటి ప్రవాహం పెరగడంతో మండలంలోని ముంపు గ్రామాల ప్రజలతో పాటు అధికారుల్లోనూ ఆందోళన మొదలైంది. గురువారం సాయంత్రానికి గ్రామాల్లోకి ప్రవేశించిన వరద నీరు క్రమేపి ఇళ్లల్లోకి ప్రవేశించింది. ఈ విషయం తెలియడంతో ఎమ్మెల్యే చింతమనేని అధికారులును అప్రమత్తం చేశారు. గోగుంట ప్రజలను వసంతవాడ జడ్పీ హైస్కూల్‌లోని శిబిరానికి, రాళ్లపల్లివారిపాలెం ప్రజలను వడ్డిగూడెం తరలించారు. శుక్రవారం ఉదయం గోగుంట వరద బాధితులను బయటకు తీసుకువచ్చే సహాయక చర్యల్లో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొన్నారు. చింతమనేని మాట్లాడుతూ.. 'గ్రామంలో 60 కుటుంబాలను పునరావాస శిబిరానికి తరలించాం. వరద ముంపు తగ్గే వరకూ శిబిరం కొనసాగుతుంది. మండలంలో వరద బాధిత కుటుంబాలకు బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకులు అందిస్తాం. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. అధైర్యపడొద్దు అండగా ఉంటాం' అంటూ భరోసానిచ్చారు. కస్టర్ ఇన్‌చార్జి గుత్తా అనిల్, ఎంపీడీవో తేజరతన్, తహసీల్దార్ ప్రసాద బాబు పాల్గొన్నారు. మరోవైపు వరద బారిన పడిన ఆర్.పి. పాలెంలో పెదవేగి సీఐ నబీ, ఎస్ఐ శుభశేఖర్ సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



వరదనీటిలో చిక్కుకున్న వారిని పునరావాస శిబిరానికి తరలిస్తున్న పోలీసులు



గోగుంటలో ట్రాక్టరును నడుపుతూ వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

బుడమేరు ఉధృతిపై కలెక్టర్ సమీక్ష

ఏలూరు సిటీ : కొల్లేరులోకి బుడమేరు వరద ఉధృతంగా వస్తున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఇరిగేష న్, వ్యవసాయ శాఖ అధికారులతో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. బుడమేరు ఏఏ ప్రాంతాల ద్వారా ప్రవహించి కొల్లేరు సరస్సులో కలుస్తుందో మ్యాప్ ద్వారా పరిశీలించి తగు ఆదేశాలను జారీచేశారు. బుడమేరు వరద ప్రభావం, కొల్లేరు వరద ముంపు నివారణా చర్యలకు సంబంధించి సమీక్షించారు. ఇరిగేషన్ ఎస్ఈ దేవ్ ప్రకాశ్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా పాల్గొన్నారు.

రూ. 2 లక్షల విరాళం అందించిన సీనియర్ సిటిజన్స్


కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న సీనియర్ సిటిజన్స్

ఏలూరు సిటీ, సెప్టెంబరు 6: ఏలూరు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధికి రూ.2,09,316 విరాళం అందించింది. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి చెక్కును అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూవిపత్కర పరిస్థితుల్లో బాధితులకు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఉపాధ్యక్షులు వి.నారాయణరావు, సెక్రటరీ డి.భాస్కరరావు, జాయింట్ సెక్రటరీ బి.నారాయణ, సభ్యులు వి.శేషగిరిరావు, కె.అమరేశ్వరరావు, టి.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్, పాన్ ఇండియా ఆర్గనైజేషన్ ఎన్టీఆర్ జిల్లా వరద బాధితుల సహాయార్థం 500 దుప్పట్లు, 300 బెడ్‌షీట్‌లు, 500 బేబీ స్లీపింగ్ ప్యాక్‌లు, 6000 శానిటరీ నాప్కిన్‌లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్‌కు అందజేశారు. హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీవో ఎన్ఎస్‌కె ఖాజావలి, చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ ఎన్.సబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వారధి ట్రస్ట్ సరుకుల పంపిణీ


సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 6: వారధి ట్రస్ట్ వ్యవస్థాపకుడు వలవల తాతాజీ ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన నిత్యావసర సరుకులను నాలుగు వాహనాల్లో శుక్రవారం విజయవాడ తరలించారు. విజయవాడ 44వ డివిజన్ ఇన్‌చార్జి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో 125 నిత్యావసర సరుకుల కిట్లను వరద బాధితులకు అందచేసినట్లు తాతాజీ తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, జనసేన నాయకుడు చింతలనాని, ధనకుమార్ తాతాజీని అభినందించారు.

నీలాద్రిపురం నుంచి నిత్యావసరాల వాహనం


సరుకుల వాహనం పంపిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, సెప్టెంబరు 6: ఉంగుటూరు మండలం నుంచి విజయాడ వరద బాధితులు దాతలు ఆదుకుంటున్నారు. పలువురు విరాళాలు అందిస్తున్నారు. నీలాద్రిపురం గ్రామస్థులు సేకరించిన నిత్యావసరాల వస్తువులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం విజయవాడ పంపించారు. నారాయణపురం గ్రామానికి చెందిన వి.సతీష్ కుమార్ రాజు రూ.50వేలు, బాదంపూడికి చెందిన యలమాటి కాశీ కృష్ణ రూ.25 వేలు నగదు సాయం ఎమ్మెల్యే ధర్మరాజు ద్వారా అందజేశారు.

సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల సాయం


నిత్యావసర సరుకుల వాహనంతో కళాశాల సిబ్బంది

పెదవేగి, సెప్టెంబరు 6: దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల వరద బాధితులను ఆదుకోవడానికి చర్యలు తీసుకుంది. 600 మందికి దుప్పట్లు, దుస్తులు, నిత్యావసరాలను సమకూర్చి శుక్రవారం విజయవాడ తీసుకెళ్లారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, డాక్టర్ పి.బాల మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడం తక్షణ కర్తవ్యమన్నారు. మరింతమందికి సాయం అందిస్తామని వారు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్లీవరాజు, ఏవో ఫాదర్ ఫెలిక్స్, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జాకబ్, అధ్యాపకులు, దంతవైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

వేలేరుపాడు, సెప్టెంబరు 6: పది రోజులుగా విడవకుండా కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్నామని, రహదారులు ధ్వంసం కావడంతో గ్యాస్‌బండలు సరఫరా చేసే వాహనాలు వచ్చే వీలులేక పస్తులుంటున్నారు. కట్టెలు తడిచి పోవడంతో కట్టెల పొయ్యిపై కూడా వంట చేయలేని పరిస్థితి నెలకొంది. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని కోయిదా, టేకుపల్లి గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, అధికారులకు గిరిజనులు మొరపెట్టుకున్నారు. ఈ రెండు గ్రామాల్లో శుక్రవారం పడవపై గ్యాస్ సిలిండర్లను తీసుకెళ్లి గిరిజనులకు అందించారు.

టీచర్ల 'సర్దుబాటు' సమస్యలను సరిదిద్దాలి : యూటీఎఫ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 6: ఏలూరు డివిజన్‌స్థాయి కౌన్సెలింగ్‌లో పదుల సంఖ్యలో ఉపాధ్యాయులను 50 నుంచి 150 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు సర్దుబాటు చేయడాన్ని నిరసిస్తూ, తక్షణమే వారిని ప్రస్తుత స్థానాల నుంచి అదే మండలంలోని ఖాళీలకు సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్ డిమాండ్ చేశారు. ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్, విద్యా కార్యక్రమాల జిల్లా పరిశీలకులు ప్రతాప్‌రెడ్డికి శుక్రవారం పని సర్దుబాటు సమస్యలను వివరించారు. సుదూర ప్రాంతాలకు సర్దుబాట్లతో టీచర్లు అనేక ఇబ్బందుల పాలవుతున్నారని, విద్యాసంవత్సరం మధ్యలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ల వల్ల వృద్ధాప్యంలోవున్న తల్లిదండ్రులున్న ఉపాధ్యాయులు, చిన్న పిల్లలున్న టీచర్లు, ఉపాధ్యాయ దంపతులు, మహిళా ఉపాధ్యాయల ఇబ్బందులను వివరించారు. డీఈవోకు లేఖలు అందజేశామని, దూరప్రాంతాలకు సర్దుబాటుచేసిన వారిని ప్రస్తుత మండలాల్లో కొరతవున్న పాఠశాలలకు అడ్జస్టేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్లలో సుదూర ప్రాంతాలకు తాత్కాలిక ప్రాతిపదికన బదిలీలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిందని, త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని విద్యాశాఖాధికారులు చెప్పినట్టు యూటీఎఫ్ నాయకులు వివరించారు.

కొల్లేరు ఆగమాగం

(ఐదో పేజీ తరువాయి)

కొల్లేరును గడగడలాడిస్తోంది. ఇప్పటికే కోమటిలంక మార్గం కొట్టుకుపోయింది. పెనుమాకలంక మార్గం నీట మునిగింది. ఏలూరు-కైకలూరు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. దీనికి కొల్లేరు అంతర్భాగంలో పేరుకుపోయిన సిల్టు ఒక కారణమైతే కొల్లేరు ఆపరేషన్ తర్వాత కూడా కొంత భూభాగం ఆక్రమణ చెరలోనే ఉండడం మరో కారణం. ఒకానొక దశలో కొల్లేరు సరస్సులోకి పట్టిసీమ నుంచి వస్తున్న గోదావరి జలాలను తరలించాలని యోచించారు. కనీసం ఒక టీఎంసీ నీటిని పోలవరం కుడి కాల్వ నుంచి మళ్లిస్తే సరస్సులో నీటి నిల్వ ఉంటుంది, తద్వారా భూగర్భ జలాలు మెరుగవుతాయి, ఉప్పునీటి సాంద్రత తగ్గుముఖం పడుతుందని అంచనా వేశారు. కాని ఇప్పుడు బుడమేరు ఉరకలేస్తూ కొల్లేరుకు చేరడం చూసి అంతా కళ్ళు తేలేశారు. డజన్ల సంఖ్యలో లంక గ్రామాలు దాదాపు ఇప్పటికే నీటిలో చిక్కుకుపోయాయి. గడిచిన రెండు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పడితే సరిపోయింది కాని లేదంటే లంకలకు వెళ్ళే మార్గాలన్నీ ఇప్పటికే స్తంభించిపోయి ఉండేవి. కాగా బుడమేరు వరద నీరంతా కొల్లేరుకు చేరుతున్న తరుణంలో ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టారు. కొల్లేరులోకి చేరుతున్న నీరు ఉప్పుటేరు మీదుగా సముద్రంలోకి ఏ స్థాయిలో చేరుతుందో అంచనాకు వచ్చారు. అయినా అనుకున్నంత స్థాయిలో బుడమేరు వరద, ఇతర వాగుల వరద కొల్లేరు నుంచి దిగువకు అనుకున్నంతగా మళ్లకపోవడాన్ని గుర్తించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సైతం శుక్రవారం ఉప్పుటేరు ముఖద్వారాన్ని పరిశీలించారు. కొల్లేరు నుంచి ఉప్పుటేరులోకి చేరే నీరు తాము ఆశించినట్టుగా ఉందా, లేదా అనేది గమనించారు.

వర్షం.. వరద

మునిగిన చేలు.. రహదారులు


పెదపాడు మండలం గోగుంటలో ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు


వృద్ధురాలిని పునరావాస శిబిరానికి తరలిస్తున్న పోలీసులు


ఏలూరు రూరల్ మండలంలో మునిగిన వరి చేలు, రహదారి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 6: వర్షం, వరదలతో కొల్లేరు తీర ప్రాంతాలు అల్లాడుతున్నాయి. ఇటీవలి వర్షాల తాకిడికి మెట్ట ప్రాంతాల్లో రహదారు ధ్వంసం కాగా ఏజెన్సీ ప్రాంతంలో కల్వర్టులు కొట్టుకుపోయాయి. బుడమేరు నుంచి కొల్లేరుకు వస్తున్న వరద నీరు, వర్షంతో ఏలూరు రూరల్ మండలంలో పాలగూడెం, జాలిపూడి, సుంకరవారితోట, కొమడవోలు, కాట్లంపూడి తదితర ప్రాంతాల్లో నారు, నాట్లు మునిగిపోయాయి. ఒకటి, రెండురోజుల్లో ముంపు సమస్య తొలగిపోతుందని మండల వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంట కాలువల్లో తూడు, కిక్కిస పెరిగిపోవడంతో చేలు నీట మునుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

జాలిపూడి, మాదేపల్లి, కొత్తూరు ఇందిరమ్మ కాలనీ తదితర గ్రామాల్లో రహదారులు గోతులమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు రహదారులు ఛిద్రం అయ్యాయి. నీరు నిండిన గోతుల్లో పడి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

- పెదవేగి: మండలంలో శుక్రవారం జోరువాన కురిసింది. వీధులు జలమయం అయ్యాయి. వాహనచోదకులు తడిసి, ముద్దయి అవస్థలు పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రి వరకు పడుతూనే ఉంది. రహదారులపై గోతుల్లో నిలిచిన నీటితో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.
- బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవలి వర్షాలకు రహదారులు, కొట్టుకుపోగా పలుచోట్ల కల్వర్టులు ధ్వంసమయ్యాయి. గ్రామాలకు వెళ్లడానికి దారి లేదు. ఉర్రింక, ఉర్రింక కాలనీ, ముంజులూరు, ఉప్పరిల్ల, దార్వాడ, చింతపల్లి, గొట్టాలరేవు, చింతకొండ, రెడ్డిబోడ్డేరు, పుచికగొంది, రేపల్లె, రేగులపాడు, బూరుగువాడ, పందిరిమామిడిగూడెం, లంకపాకల, అలివేరు తదితర గ్రామాల రహదారులు వరదలకు కొట్టుకుపోయాయి. కల్వర్టులు దెబ్బతిన్నాయి. పలుచోట్ల కొండరెడ్డి గిరిజనులే రహదారుల ను మట్టితో పూడ్చి బాగుచేసుకున్నారు.
- ఉంగుటూరు: బాదంపూడి-తాడేపల్లిగూడెం రహదారి వర్షాలకు అధ్వానంగా తయారైంది. బాదంపూడి మలుపు నుంచి సుమారు కిలో మీటరు రహదారిలో పేషంట్లు, గర్భిణుల రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. కనీస మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- కుక్కునూరు: మండలంలో ప్రధాన రహదారి, గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. భారీ వర్షాలకు గోతుల్లో వర్షపునీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. కుక్కునూరు, భద్రాచలం, కుక్కునూరు, అశ్వారావుపేట ప్రధాన రహదారి ఛిద్రంమైంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బుట్టాయగూడెం మండలం ఉర్రింకలో కొట్టుకుపోయిన కల్వర్టు



ఏలూరు రూరల్ మండలం, కుక్కునూరులో వర్షాలకు రోడ్డుపై గోతుల్లో చేరిన నీరు


పెదవేగిలో జోరు వాన

వృథా నీరు క్వారీ గోతుల్లోకి మళ్లింపు


మోటార్ ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, సెప్టెంబరు 6: న్యాయంపల్లి పెద్దచెరువు నుంచి గుండేరులోకి వృథాగా పోతున్న వర్షపు నీటిని మోటార్లు ఏర్పాటు చేసి, సమీపంలోని క్వారీ గోతుల్లోకి మళ్లించే ఏర్పాటు చేశారు. రైతుల ఆర్థిక సాయంతో న్యాయంపల్లి పెద్దచెరువు దగ్గర ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ మోటార్లను ఎమ్మెల్యే ప్రభాకర్ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. క్వారీ గోతుల్లో నీరు పెడితే దిగువున రైతుల బోరుబావుల నుంచి పుష్కలంగా నీరు వస్తుందన్నారు. మోటార్లు ఏర్పాటు చేసి, పైపుల ద్వారా వృథా జలాలను క్వారీ గోతుల్లోకి మళ్లిస్తున్నామని ఆయన వివరించారు. ఒక్కో మోటారుద్వారా సగటున గంటకు లక్ష లీటర్ల నీరు క్వారీ గోతుల్లో వెళ్తుందని పది రోజుల్లో పూర్తిస్థాయిలో నిండుతాయన్నారు. దీంతో భూగర్భ జలాల పెంపునకు ఈ నీరు దోహదపడుతుందని ప్రభాకర్ తెలిపారు. ఉండవల్లి వెంకట్రావు, తాతా సత్యనారాయణ, బొప్పన సుధాకర్, దావులూరు శ్రీనివాసరావు, కొమ్మిన నాగేశ్వరరావు, కొమ్మిన వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రావూరి రామకృష్ణ, వెంకటేశ్వరరావు, రావిపాటి వెంకటేశ్వరరావు, కొమ్మిన సోమశేఖర్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో బీజేపీ నేతల పరిశీలన


బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చైతన్యకృష్ణ

దెందులూరు, సెప్టెంబరు 6: నియోజకవర్గంలో బుడమేరు ముంపు ప్రాంతాలను బీజేపీ కన్వీనర్ గుమ్మడి చైతన్యకృష్ణ శుక్రవారం పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఇప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. పెదపాడు మండలం పరిధిలో మునిగిన వసంతవాడ, ఇతర ప్రాంతాల్లో బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుంటుందన్నారు. మణికొండ రమేష్, యందం నాగరాజు, మహేశ్వరావు, మురళీకృష్ణతో కలిసి వసంతవాడలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని వారు పరిశీలించారు.

కొంగలచెరువు గట్టు పనులు పూర్తిచేయాలి


గట్టును పరిశీలిస్తున్న ఎస్‌డీసీ ముక్కంటి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 6: పుట్లగట్లగూడెంలో కొంగల చెరువు గట్టు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మేరుగు ముక్కంటి ఇరిగేషన్ డీఈ రాంబాబును ఆదేశించారు. కొంగలచెరువు గట్టును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు గట్టు దెబ్బతినడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పూడిక పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎర్రకాలువ జలాశయాన్ని పరిశీలించారు. తహసీల్దారు కె.స్లీవజోజి, ఎంపీడీవో కేవీ.ప్రసాద్ ఉన్నారు. పంగిడిగూడెం నుంచి రాజవరం రహదారి చప్టాపై ఎర్రకాలువ నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దారు కె.స్లీవజోజి, ఎంపీడీవో కెవి.ప్రసాద్ రహదారిని పరిశీలించారు. పోలీసు, వీఆర్వో గస్తీ ఉంచినట్లు తహసీల్దారు తెలిపారు. శుక్రవారం 2547 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి చేరుతుండగా 2547 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డీఈ రాంబాబు తెలిపారు.

జిల్లా జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6: జిల్లా జైలులో పరిశుభ్రత పాటించాలని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా జైలులో ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఖైదీలకు వెళ్తున్న ఆహారపదార్థాలను రుచి చూశారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఎల్ఈడీసీ ద్వారా ఖైదీలకు మెరుగైన ఉచిత న్యాయసహాయం అందించబడుతుందన్నారు. ఎల్ఇడిసి ద్వారా 150పైగా బెయిల్ దరఖాస్తులు దాఖలు చేయడం జరిగిందన్నారు. జైలు సూపరింటెండెంట్ సిహెచ్ఆర్‌విఎ స్వామి, ఎల్ఈడీసీ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మునేశ్వరరావు, మధు, జైలర్లు శ్రీనివాసరావు, వెంకట రెడ్డి పలువురు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై రైతులు దృష్టి సారించాలి

చింతలపూడి, సెప్టెంబరు 6: రసాయన ఎరువుల వల్ల భూసారం తగ్గిపోతోందని, రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టిపెట్టాలని ఏడీఏ లలితసుధ సూచించారు. రాఘవాపురంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు, వాతావరణంలో జరుగుతున్న మార్పులు దృష్ట్యా రైతులు ప్రకృతి వ్యవసాయమే మేలు అన్నారు. రైతులు ప్రస్తుతం దిగుబడులు కోసం రసాయనిక ఎరువులు అధికంగా వాడుతున్నందున భూమిలోని సేంద్రియ కార్బనం రోజురోజుకు తగ్గిపోతోందన్నారు. దీంతో పాటు పురుగుమందుల వినియోగంతో దుష్ప్రభావాలు చూపిస్తున్నాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో ఈ దుష్ప్రభావాలు తగ్గి భూమి సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో చింతలపూడి ఏవో మీనాకుమారి, శివ, వెంకన్నబాబు, రైతులు పాల్గొన్నారు.

అడవులను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత


అడవిలో విత్తనాలు చల్లుతున్న దృశ్యం

టి.నరసాపురం, సెప్టెంబరు 6: అడవులను పరిరక్షించుకోవడం అందరి బాధ్యతని బంజారా భజరంగీ భేరీ సంఘం మండల నాయకులు బూక్యా బిగనాథం అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం అడవుల్లో శుక్రవారం విత్తనాలు చల్లారు. అంతరించి పోతున్న అడవులను పరిరక్షించుకునే ఉద్యమంలో భాగంగా పలు రకాల విత్తనాలు చల్లే కార్యక్రమం చేపట్టామన్నారు. అడవులు ఫల, పుష్ప వృక్షాలతో దట్టంగా ఉంటే పక్షులకు, జంతువులకు సురక్షిత నివాసంతో పాటు వాటికి ఆహారం లభిస్తుందన్నారు. పంట పొలాలు, గ్రామాల్లో దాడులు చేయవని జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస్ నాయక్ అన్నారు. కృష్ణాపురం అడవుల్లో లక్ష విత్తనాలు చల్లేవరకు దశలవారీగా చేపట్టి అంతరించిపోతున్న అడవులకు తిరిగి పూర్వవైభవం తీసుకురావడానికి బంజారా బజరంగీ భేరీ సంఘం కృషిచేస్తుందని సంఘ కోశాధికారి ధరావత్ రవినాయక్ అన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 6: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వైవీ.లక్ష్మణరావు సూచించారు. చేబ్రోలు-1, 2 సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వే డ్రైడేపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా డెంగీ, దోమలవ్యాప్తిని నిరోధించాలని కోరారు. ఇంటి కిటికీలకు, తలుపులకు మరుగుదొడ్లకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుటు కూ.శ్రీనివాసరావు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.58 వేల విలువైన కుర్చీలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 6: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురష్కరించుకుని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్.మణికుమార్, విజయ కుమారి దంపతులు రూ.50 వేల విలువైన కుర్చీలు శుక్రవారం పాఠశాలకు అందజేసినట్ల హెచ్ఎం కెఎస్‌వి.లోవకుమారి తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎస్‌వి.రమణ రూ.8వేలు విలువైన ఆఫీస్ ఛైర్ అందించనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఎం.ప్రకాష్, టి.జగదీష్, సీహెచ్.సుధాకర రెడ్డి పాల్గొన్నారు.

ర్యాంపు పునరుద్ధరించిన పంచాయతీ అధికారులు

పోలవరం, సెప్టెంబరు 6 : పోలవరం పంచాయతీలో ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి రాకపోకలు సాగించే ర్యాంపును అధికారులు పునరుద్ధరించారు. సమస్యలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో శుక్రవారం పంచాయతీ అధికారులు యంత్రాలతో ర్యాంపు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. పాతపోలవరం, మసీదు వీధి, వడ్డీలపేట, ఏనుగులవీధి ప్రాంతాల ప్రజలు ఆస్పత్రికి, విద్యార్థులు కాలేజీకి, స్కూళ్లకు రాకపోకలు సాగించే ర్యాంపులు సరిలేక ఇబ్బందులకు గురవుతున్నారు. రానున్న రెండు రోజుల్లో ర్యాంపు పునరుద్ధరణ పూర్తవుతుందని సర్పంచ్ పొడుం పుష్ప, మంగిన వెంకటరమణ, పోశీరత్నం, మేడుం పార్వతి తెలిపారు.

అంగన్‌వాడీలో బోధనపై అవగాహన

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 6: తాడువాయి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం స్వదేశీ బొమ్మలు తయారు చేసి వాటి ద్వారా పిల్లలకు ఏవిధంగా బోధించాలో తల్లులకు అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్ పిల్లలకు బంక మట్టి, రావి ఆకుతో వినాయకుడిని చేసే విధానాన్ని నేర్పించి వినాయక చవితి విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి.బ్యూలా, సూపర్‌వైజర్ కె.లక్ష్మి,ఆరోగ్య సిబ్బంది తేజస్విని, అంగన్వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

ఏలూరు సిటీ/క్రైం, సెప్టెంబరు 6: జిల్లా ప్రజలకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ శివ కిశోర్ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని అనుగ్రహంతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రజలందరు ఆనందోత్సాహాల మధ్య కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లాలోని ప్రజలు వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, మత సామరస్యం కొనసాగించాలని సూచించారు. మట్టి గణపతిని పూజించి వినాయక చవితిని పర్యావరణ హితంగా జరుపు కోవాలని వారు పిలుపునిచ్చారు.

ఏపీజీఎల్ఐ చందాదారులకు సూచన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 6: ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ ప్రీమియం మొత్తాన్ని పెంచుకోవడానికి 'నిధి' పోర్టల్ ఎంప్లాయి లాగిన్‌లో ఆప్షన్‌ను పునరుద్ధరించారని ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకుడు జి.కృష్ణ శుక్రవారం తెలిపారు. ప్రీమియం మొత్తాన్ని పెంచుకున్న వెంటనే సంబంధిత డీడీవో లాగిన్‌కు వెళుతుందని, అక్కడ అప్రూవ్ చేశాక పెంచిన ప్రీమియం ఉద్యోగి జీతంనుంచి మినహాయింపు జరుగుతుందని వివరించారు. ఆ తర్వాత పెరిగిన ప్రీమియంకు ప్రత్యేకంగా బాండ్ జనరేట్ అవుతుందన్నారు.

జీసీడీవో పోస్టు భర్తీకి నోటిఫికేషన్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 6 : సమగ్రశిక్ష ఏలూరు జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగావున్న జీసీడీవో (బాలికాభివృద్ధి అధికారి) పోస్టు భర్తీకి జిల్లాలోని హైస్కూల్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం శుక్రవారం తెలిపారు. ఆసక్తివున్న టీచర్లు ఈ నెల 10న సాయంత్రం 5గంటల్లోగా ఏలూరులోని ఎస్ఎస్ఏ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తు నమూనా డీఈవో ఏలూరు.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. వివరాలకు 99590 21342లో సంప్రదించాలని కోరారు.

సీపీఎం నేత ఆర్ఎస్‌కు నివాళి

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 6 : సీపీఎం కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, సీపీఎం సీనియర్ నేత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మృతికి సంతాప సభ నిర్వహించారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి సి.కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆర్ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. టి.వి.నరసింహారావు, పి.రామకృష్ణ, డి.జగన్నాధరావు, వి.వి.ఎన్.ప్రసాద్, జె.గోపి, ఎస్.సత్యనారాయణ, మీసాల సత్యం, దువ్వి రామారావు, వెంకటేశ్వరరావు, శేఖర్, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య బండి వెంకటేశ్వరరావు నివాళులర్పించారు.





ఏలూరు నగరం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం పట్టణాలు, కొయ్యలగూడెం సెంటర్‌లో వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలు సందడి

చవితి సందడి

పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్ కిటకిట

చింతలపూడి, సెప్టెంబరు 6: పలుచోట్ల చవితి మండపాలు ఏర్పాటు చేస్తుండగా, మరోపక్క వినాయక చవితి పూజా సామగ్రి సందడి నెలకొంది. వివిధ రకాల పత్రి, తామర పువ్వులు, వినాయక ప్రతిమలు, పండ్లు కొనుగోలుకు శుక్రవారం పలువురు తరలివచ్చారు. ఒక్కసారిగా వర్షం పడడంతో అమ్మకాల జోరు తగ్గింది. రాత్రి 7 గంటల తర్వాత వాన తగ్గడంతో కొంతవరకు అమ్మకాలు జరిగాయి.

- జంగారెడ్డిగూడెం: పట్టణంలో చామంతి పూల ధరలు ఆకాశాన్నంటాయి. ఉదయం కిలో చామంతి పూల ధర రూ.350 ఉంటే రాత్రి ఏడు గంటల నుంచి కిలో రూ.500 పలికింది. వినాయకుని మట్టి విగ్రహాలు, పత్రి, కాయలు, పండ్ల ధరలు కూడా ఎక్కువగా ఉన్నాయి. బోసుబొమ్మ సెంటర్, గంగానమ్మ గుడి సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలలో రద్దీతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.
- కొయ్యలగూడెం: వినాయక చవితికి మండలంలో గణపతి ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రధాన సెంటర్‌లో పత్రి కొనుగోలు చేయడానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో కన్నాపురం, బయ్యన్నగూడెం గ్రామాల్లో చవితి ఉత్సవాలు పెద్దఎత్తున చేస్తున్నారు.
- నిడమర్రు: మండలంలో భువనపల్లి, ఛానమిల్లి, ఎనికేపల్లి, బావాయిపాలెం, క్రొవ్విడి, నిడమర్రు, పెదనింద్రకొలను గ్రామాలలో గణపతి ఉత్సవాలకు వేదికలు ఏర్పాటు చేశారు. మండపాల చుట్టూ విద్యుత్ దీపాలంకరణ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో వినాయకచవితి వ్యాపారులు ఇబ్బందులుకు గురయ్యారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

ఉంగుటూరు: మండలంలోని ఉప్పాకపాడు ఫౌండేషన్ పాఠశాలలో విద్యార్థులు మట్టి గణపతి విగ్రహాల తయారీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు అల్లు శ్రీను, పి.శ్రీదేవి, తదితరులు మట్టి విగ్రహాలను తయారు చేయించారు. ఉంగుటూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, రెడ్డి సూర్యచంద్రరావు గ్రామస్తులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి బండారు సింధు మధు,

ఏలూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలతో పూజలు చేయాలని జనసేన నాయకులు నారా శేషు అన్నారు. ఎన్.ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మభేరీ ప్రాంగణంలో పదివేల వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇళ్ల శ్రీనివాస్, వాణిచౌదరి, ఎన్.ఫౌండేషన్ సభ్యులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- ఏలూరు కార్పొరేషన్: నగరంలో గణేశ్ నవరాత్రులు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. తాత్కాలిక పందిళ్లలో గణనాథుడి విగ్రహాలను నెలకొల్పారు. శనివారం నుంచి గణపతి నవరాత్రులు నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు వాతావరణం అనుకూలంగానే ఉంది. ఆకస్మికంగా వాతావరణంలో మార్పులు వచ్చి ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురియడంతో నిర్వాహకులు నిరుత్సాహానికి గురయ్యారు.


నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, మంతెన సీతారాం, పి.మధు, వెంకటేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు, బి.బలరాం తదితరులు

ఆర్‌ఎస్‌కు కన్నీటి వీడ్కోలు

స్వగ్రామం చించినాడలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

యలమంచిలి, సెప్టెంబరు 6: సీపీఎం ఉమ్మడి జిల్లాల పోరాటాల రధసారథి, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) అంత్యక్రియలు ఆయన స్వగ్రామం చించినాడ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ లాంచనాలతో జరిగాయి. ఆర్‌ఎస్‌కు సీపీఎం నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన భౌతికకాయాన్ని భీమవరం నుంచి గురువారం రాత్రి ఆయన స్వగృహానికి తరలించి ప్రజల సందర్శనార్థం శుక్రవారం ఉదయం11 గంటల వరకూ ఉంచారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.మధు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు, మాజీ ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాదరాజు, దిగుపాటి రాజగోపాల్, నరసాపురం టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు బి.తులసీదాస్, సీపీఎం కార్యకర్తలు, గ్రామస్తులు ఆర్‌ఎస్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చించినాడ గ్రామ వీధుల్లో అంతిమయాత్ర నిర్వహించారు. వశిష్ట గోదావరి ఒడ్డున ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్.ఎస్.కు అత్యంత సన్నిహితుడు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అంత్యక్రియలు జరిపారు. సీపీఎం సభ్యులు వై.వెంకటేశ్వర రావు, ఉమామహేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు బి.బలరాం, ఎ.రవి, కేతా సూర్యారావు, కానేటి బాలరాజు, బాతిరెడ్డి జార్జి, తెన్నేటి స్టాలిన్, దేవ సుధాకర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.


ప్రతాప్‌రెడ్డితో చర్చిస్తున్న 'అపుస్మా' జిల్లా నాయకులు

నమ్మకం కలిగిస్తేనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్పెషలాఫీసర్ ప్రతాప్‌రెడ్డి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 6 : ప్రభుత్వ పాఠ శాలలపై ప్రజలకు నమ్మకం కలిగిస్తేనే భవిష్యత్తులో వాటి మనుగడ ఉంటుందని, ఇందుకు ఉపాధ్యాయులే బాధ్యతలు తీసుకోవాలని రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్, విద్యా కార్య క్రమాల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రత్యేకాధికారి ప్రతాప్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం ఏలూరు ఎంఈవో కార్యాలయ మీటింగ్ హాలులో జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలతో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా తీసుకునే యూ-డైస్ ప్లస్ డేటాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, సీడబ్ల్యుఎస్ఎన్ పిల్లల వివరాలు తదితర అంశాలన్నీ నూరుశాతం పక్కాగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. నాడు-నేడు కార్యక్రమంలో చేపట్టిన పనులపై సమీక్షించారు. పెండింగ్‌లో వున్న పనులకు అవసరమైన నిధుల గురించి వివరాలను డీఈవోకు అందజేయాలని, ఇప్పటికే నిదులున్న పాఠశాలల్లో తక్షణమే మిగిలివున్న పనులను పూర్తిచేయాలన్నారు. ఉమ్మడి జిల్లాకు పీఎం-శ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన ల్యాబ్‌లు, ప్రహరీగోడల నిర్మాణపనులను వెంటనే పూర్తిచేయాలని కోరారు. అనంతరం వ్యాయామోపాధ్యాయులతో సమావేశ మయ్యారు. డీఈవో అబ్రహం, అసిస్టెంట్ డైరెక్టర్లు అవధాని, షరీఫ్, సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లోనూ ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు

ప్రభుత్వం నిర్దేశించిన కేలండర్ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లోనూ అన్ని పరీక్షలను నిర్వహించడంతో పాటు, విద్యార్థులు సాధించిన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందేనని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా స్పెషలాఫీసర్ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఏలూరు విచ్చేసిన ప్రతాప్‌రెడ్డి డీఈవో కార్యాలయంలో ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించరాదని, విద్యార్థులకు ఇండోర్ గేమ్స్‌నైనా నిర్వహించాల్సిందేనని ఆదేశించారు. పదో తరగతి హిందీ సబ్జెక్టు సిలబస్ విషయమై ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. 'అపుస్మా' నాయకులు డాక్టర్ ఎంబీఎస్ శర్మ మాట్లాడుతూ పదో తరగతి హిందీ, సోషల్ స్టడీస్ సిలబస్ చాలా ఎక్కువగా ఉందని, గత విద్యా సంవత్సరం సిలబస్‌తో పోల్చితే ఒకటిన్నర రెట్లు ప్రశ్నలు అధికంగా ఉన్నాయని డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. 'అపుస్మా' జిల్లా కార్యదర్శి ఎన్.ఆర్.కే.ఏ.ప్రసాద్, ఏలూరు, దెందులూరు, నూజివీడు జోన్ల నాయకులు వెంకటేశ్వరరావు, సతీష్, మోహనరావు, శేఖర్, తంబి, తదితరులున్నారు.

ఐదు గంటల ఆలస్యంగా లింగంపల్లి ఎక్స్‌ప్రెస్

నరసాపురం, సెప్టెంబరు 6: నరసాపురం నుంచి లింగంపల్లి వెళ్లే ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఐదు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. షెడ్యూల్ ప్రకారం 6.55కి బయలు దేరాల్సి ఉండగా రాత్రి 11.55కి బయలు దేరుతున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలు ఆలస్యానికి కారణమని సమాచారం. ఉదయం 8.50కు రావాల్సిన నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 7.30కు వచ్చింది. ఈ రైలుకే నిర్వహణ పనులు చేపట్టి లింగంపల్లికి పంపాల్సి ఉంది. దీంతో నిర్వహణ పనులకు ఐదు గంటలు పట్టడంతో లింగంపల్లి ఆలస్యంగా బయలు దేరింది. ప్రయాణికులు స్టేషన్‌లో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 6: ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను శుక్ర వారం ద్వారకాతిరుమల పోలీ సులు అడ్డుకున్నారు. ఒక జేసీబీ, ట్రాక్టరును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తర లించారు. గ్రామంలోని చెరువులో స్థానికుడు ఒకరు కొద్దిరోజులుగా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నాడు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ మట్టి రూ.500 నుంచి రూ.700 వరకూ విక్రయిస్తున్నాడు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా తీరుమారలేదు. దీంతో ఎస్ఐ సుధీర్ అక్కడకు వెళ్లి మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తొలి పూజకు వేళాయె..

వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు

మార్కెట్‌లో ధరాఘాతం



ఏలూరు సిటీ/ భీమవరం టౌన్/నరసాపురం / ఆచంట/ పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 6:

వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ
నిర్విఘ్నం కురుమేదేవా సర్వకార్యేషు సర్వదా..

గణనాథుని పూజకు వేళయింది. ఎప్పుడూ తొలి పూజ గణపతిదే. వినాయకుడిని కొలిస్తే సర్వ శుభాలు కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. గణనాథునికి తొలిపూజ చేయాలని దేవతలు కూడా భావించారు. అందుకే హైందవ సంప్రదాయంలో వినాయక చవితి పండుగకు అత్యంత ప్రాధాన్యం ఉంది. వినాయకచవితి ఉత్సవాలకు వాడవాడలా నిర్వహిస్తుంటారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేశారు. ఏలూరు నగరంలో రామకోటి సెంటర్, కుండీల సెంటర్, కూరగాయల మార్కెట్‌ల 18 నుంచి 20 అడుగుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి దాదాపు ఆరునెలలపాటు ఇక్కడే ఉండి పీవోపీ, మట్టి విగ్రహాలను తయారు చేస్తుంటారు. పర్యావరణ హితంగా వేడుకలు నిర్వహించాలనే ప్రచారంతో మట్టి విగ్రహాలే ఎక్కువగా కొనుగోళ్ళు జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి చవితి సందడి పెరిగినా విగ్రహాలు అంతంత మాత్రంగానే అమ్ముడవుతున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. విగ్రహాల ధరలు కూడా గతంతో పోలిస్తే పెరిగాయి. దీంతో చాలా మంది తక్కువ ఎత్తులో విగ్రహాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. భీమవరంలో పంచారామ క్షేత్రమైన సోమేశ్వరస్వామిఆలయం వద్ద, తణుకు విఘ్నేశ్వరస్వామి దేవస్థానం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపరం తదితర పట్టణాల్లో కూడా చవితి ఉత్సవాలు నిర్వహిచేందుకు భారీగా ఏర్పాటు చేశారు. నరసాపురం మెయిన్‌రోడ్ కళకళలాడింది. వైఎస్ఆర్ విగ్రహం నుంచి శివాలయం వరకు తోపుడు బండ్లపై వందల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇటు పూవ్వులు, పండ్ల దుకాణాల వద్ద కూడా రద్దీ కనిపించింది. కిరాణ, బట్టల షాపులు కళకళలాడాయి.ఆచంట కచేరి సెంటర్ సందడిగా మారింది. మధ్యాహ్నం వరకు అంతంతమాత్రంగా ఉన్న సెంటర్ సాయంత్రం నుంచి కొనుగోలు చేసేందుకు ఎక్కువ సంఖ్యలో రావడంతో కచేరి సెంటర్ ఆయా దుకాణాల వద్ద కొనుగోలు దారులతో కిక్కిరిసిపోయింది. పాలకొల్లులో ఉదయం నుంచి రాత్రి వరకూ మార్కెట్ అంతా రద్దీగా కనపడింది.

అల్పపీడన ప్రభావం

ఈసారి వినాయక చవితి పండుగపై అల్పపీడన ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల భారీగా వర్షాలు కురిసినా గురువారం కొంత వర్షం శాంతించింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా మబ్బుల వాతావరణం ఏర్పడింది. అంతేగాక శనివారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చ రికలు జారీ చేయడంతో నిర్వాహకులు ఉత్సవాలు ఎలా నిర్వహించా లన్న మీమాంశలో పడ్డారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో భారీ వర్షం కురవటంతో వ్యాపారస్తులు కంగుతిన్నారు. సరుకులు సర్దుకునేందుకు ఎటువంటి అవకాశం లేకుండా దాదాపు 20 నిమిషాల పాటు ఏకధాటిగా వర్షం కురువడంతో అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపింది

ధరాఘాతం

పూలు, పండ్లు, చవితి పత్రి , ఇతర సామాగ్రి ధరలకు రెక్క లొచ్చాయి. గతంతో పోలిస్తే ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో చవితి వ్యాపారం మాత్రం సాధారణంగానే కొనసాగుతోంది. గురువారం సాయంత్రం నుంచే చవితి వ్యాపారులు పత్రి, పూలు, పండ్లు, పాలవెల్లి, ఇతర డెకరేషన్ సరుకులు అమ్మకాలు ప్రారంభించారు. ధరలు పెరగటంతో చాలా మంది తక్కువగానే కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు ఏలూరు నగరంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షం కురుస్తుండటంతో వర్షంలోనే పూజా సామాగ్రిని కొనుగోలు చేస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల వారు మట్టి విగ్రహాలను, వినాయక వ్రతకల్పం పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నారు.


వానలోనే ఏలూరులో మండపం వద్ద డెకరేషన్ పనులు

చవితి చందా.. దందా !

నిడమర్రు సెప్టెంబరు 6: చవితి చందాల దందాలు హద్దులు మీరుతున్నాయి. భక్తి శ్రద్ధలతో నిర్వహించే వినాయక చవితి వేడుకల్లో విపరీత పోకడలు చోటుచేసుకొంటున్నాయని సామాన్య భక్తులు ఆవేదన చెందుతున్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రజలలో ఐక్యతా భావం పెంపొందించడం కోసం బాలగంగాధర్ తిలక్ సామూహిక గణేష్ మహోత్సవాలు నిర్వహించేవారు. నేడు వీధికో విగ్రహం, కులాలు, వర్గాల వారీగా విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ నాయకులు తమ బల ప్రదర్శన కోసం ఈ గణేష్ ఉత్సవాలను వేదికగా చేసుకోవడం విడ్డూరం. భక్తి కన్నా బలప్రదర్శన ఎక్కువ కనబడుతోందని సంప్రదాయ వాదులు వాపోతున్నారు. కమిటీ కర్రోళ్ళు ఒకరిని చూసి మరొకరు పోటీ పడి ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహం సైజు మొదలు, మండపం అలంకరణ, లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు ఏర్పాట్లు ఇలా అన్నింటిలోనూ పోటీ పడుతున్నారు. అన్నదానాల్లో కూడా పోటీలు పెరిగి మేము 13 రకాల స్వీట్లు పెట్టామని, మేము 8 రకాల కూరలు పెట్టామంటూ గొప్పలు చెప్పుకొంటున్నారు. వీటికోసం పోటీలు పడి భారీ ఎత్తున చందాలు వసూలు చేస్తున్నారు. చివరకు ఇది ఒక దందాలా తయారైందని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. రోజుకు 5 నుంచి 10 మంది ఉత్సవకమిటీ వాళ్లు వస్తున్నారని వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్న ఊరులోనే కాకుండా పక్క ఊర్లకు వెళ్లి చందాలు వసూలు చేస్తున్నారు.


పాలకొల్లులో పూజా సామగ్రి అమ్మకాలు



ఏలూరులో వర్షంలోనే పూజా సామగ్రి కొనుగోళ్లు



భీమవరంలో జోరువానలో మార్కెట్..

రాష్ట్రస్థాయి పోటీలకు కైకరం విద్యార్థులు



ఉంగుటూరు, సెప్టెంబరు 6 : కైకరం హైస్కూలు విద్యార్థులు అండర్-16 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపి కైనట్లు ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు తెలిపారు. శుక్ర వారం హైస్కూలులో ఎంపికైన విద్యార్థులు వందాని పవన్ కుమార్, గాలింకి లావణ్యలను ప్రశంసించారు. పి.డి.లు జి.నాగ సుధ, పాపాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్, కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గురుకుల విద్యాలయంలో ఎంపిక పోటీలు

పెదవేగి, సెప్టెంబరు 6 : నిత్యసాధన, నిరంతర శ్రమ విద్యార్థి అభివృద్ధికి చిహ్నమని పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఈనెల 21వ తేదీవరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) 19 ఏళ్ళ విభాగం క్రీడా జట్ల ఎంపిక పోటీలను శుక్రవారం ఉదయం ప్రారంభించారు. బాలురకు సంబంధించి కబడ్డీ, వాలీబాల్,ఖోఖో, బాల్ బాడ్మింటన్, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని పీడీ కె.జయరాజు తెలిపారు. విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ ఆచార్యులు, పీఈటీ గురుమూర్తి, ఇతర కళా శాలల నుంచి వచ్చిన పీడీలు శ్రీనివాసరావు, నాగమణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బ్రైట్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



పాలకోడేరు, సెప్టెంబరు 6: కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలలో పెన్నాడ బ్రైట్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ తెలిపారు. 2017 నుంచి ప్రధాని నరేంద్రమోడీ పిలుపుతో కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం పోటీలను నిర్వహిస్తూ వస్తుంది. ఈ ఏడాది 18 విభాగాలలో 275 సమస్య లను కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు గుర్తించాయన్నారు. ఆ సమస్యలకు విద్యార్థులు తమ ఆలోచన శక్తితో పరిష్కారాలను కనుగొనాలని తెలిపారు.తమ కళాశాలలో పోటీలు నిర్వహించగా విద్యార్థులు ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ తెలిపారు.

మా బిడ్డను బతికించండి

ప్రభుత్వాన్ని వేడుకుంటున్న తల్లిదండ్రులు
గుండె చుట్టూ పెరిగిన కండరాలు
శ్వాస తీసుకోవడం కష్టం కావడంతో అత్యవసర చికిత్స
వైద్యానికి రూ. 5 లక్షలు పైనే ఖర్చు


రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక గోగుల మౌనిక.. పక్కన (ఫైల్‌ఫొటో)

బుట్టాయగూడెం, సెప్టెంబరు 6 : ఈ చిన్నారి పేరు మౌనిక. వయసు 13 ఏళ్లు. ఊరు బుట్టాయగూడెం మండలం లంక పాకల. కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని లంకాలపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది.బుధవారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా ఊపిరి తీసుకోవడం కష్టం కావడంతో తల్లిదండ్రులు ఆమెను రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి గుండె చుట్టూ కండరాలు పెరగడంతో శ్వాస తీసుకోవడం కష్టంగా వుందని నిర్ధారించారు. ఆమెకు అత్యవసర వైద్యం అందించాలని, ఇందుకు ఏడు నుంచి ఎనిమిది ఇంజక్షన్లు చేయాల్సి వుందని అయితే ఒక్కో ఇంజక్షన్ ఖరీదు వేలల్లో వుంటుందని స్పష్టం చేశారు. ఈ వైద్యానికి సుమారు ఐదు లక్షలు పైనే ఖర్చు అవుతుందని చెప్పారు. అయితే అంత ఖర్చు పెట్టే స్థోమత తమకు లేదని కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు గోగుల చిన్నయ్య, సంధ్య వాపోతున్నారు. కొండరెడ్లమైన తాము పాపే ప్రాణంగా బతుకు తున్నా మని, ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించి తమ బిడ్డకు ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించాలని కోరుతున్నారు.ఆదివాసీల కోసమే పనిచేస్తున్నామని చెప్పుకునే ఐటీడీఏ అధికారులు ఈ బిడ్డకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కారం రాఘవ డిమాండ్ చేశారు.

పూళ్ళలో డెంగీతో విద్యార్థిని మృతి



భీమడోలు, సెప్టెంబరు 6 : భీమడోలు మండలం పూళ్ళ జిల్లా పరిషత్ హైస్కూలులో పదవ తరగతి చదువుతున్న పేదాడ మీనాక్షికి డెంగీ జ్వరం సోకి చికిత్స పొందుతూ మృతి చెందింది. నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న మీనాక్షి ఏలూరు ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందినట్లు జిల్లా పరిషత్ హైస్కూలు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని మృతి పట్ల హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.


ఆచంటలోజరిగిన సామాజిక తనిఖీ సభలో అధికారులను వివరాలు అడుగుతున్న కొడమంచిలి కూటమి సభ్యులు

ఉపాధి పనుల్లో అవకతవకలు

రూ.5 లక్షలు పైనే గోల్‌మాల్

ఆచంట, సెప్టెంబరు 6 :జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ఆచంట మండలంలో 2023 -24 సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి పనులపై గ్రామసభలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలం మొత్తం మీద 1367 పనులకు గాను 6 కోట్ల 67 లక్షల 66 వేల 360 రూపాయలు ఖర్చు పెట్టగా దీనిలో 5 లక్షల 14 వేల 342 రూపాయలు నిధులు అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనిలో కొడమంచిలిలో ఏకంగా ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌పై 4 లక్షల 94 వేల 126 రూపాయలు బినామీ మస్టర్‌లు వేసి సొమ్ములు గోల్‌మాల్ చేసినట్లు అధికారులు గుర్తించారు. అలాగే 3 లక్షల 11 వేల 183 రూపాయలకు సంబంధించి వేత న దారులకు తిరిగి చెల్లించాల్సి ఉందని కోడేరులో ఎస్ఎస్ఏ ద్వారా నిర్మించిన కాంపౌండ్‌వాల్‌కు సంబంధించి రూ. 2లక్షల 12 వేల 124 రూపాయలు విచారణ చేయాల్సి ఉందని అధికారులు గుర్తించారు. అవకతవలకు సంబంధించి కొడమంచిలి ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు మండలంలో గతంలో చేసిన టెక్నికల్ అసిస్టెంట్‌పై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ నారాయణ, ఎంపీడీవో నర్సింహ ప్రసాద్, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపీపీలు యర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ గోవిందరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తాళాలు పగులగొట్టి చోరీ

ముదినేపల్లి, సెప్టెంబరు 6 : ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో రిటైర్డ్ హెచ్ఎం మారగాని మారయ్య ఇంట్లో చోరీ జరిగింది. ఆయన మూడు నెలలుగా అమెరికాలోని తన కుమారుడి వద్ద ఉంటున్నారు. ఇంటి తాళం పగులకొట్టి ఉండటాన్ని రైతు చూసి గ్రామంలోని మారయ్య బంధువులకు తెలపడంతో వారు ఇంటిలోకి వెళ్లి చూడగా మిక్సీ, ఇన్వర్టర్, బ్యాటరీ తదితర వస్తువులు అపహరించినట్లు పోలీసులకు తెలిపారు. సుమారు రూ.45 వేల విలువైన పరికరాలు పోయినట్లు గుర్తించారు. అమెరికా నుంచి ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు పంపారు.

క్రైం కార్నర్..

పోక్సో కేసులో జీవిత ఖైదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6 : బాలిక పట్ల లైంగిక దాడికి పాల్పడి అత్యాచారం చేసినట్లు ఒక యువకుడిపై నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదు, ఐదు వేల రూపాయల జరిమానా బాధితు రాలికి మూడు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఏలూరులోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సునంద శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామానికి చెందిన చెమటపాము రమేష్ (20) 2014 ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పారిపోయాడు. బాలిక తల్లితో జరిగిన సంఘటన చెప్పడంతో తడికలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి అప్పటి చింతలపూడి సీఐ వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, జంగా రెడ్డిగూడెం ఇన్‌స్పెక్టర్ రాజేష్, హెడ్ కానిస్టేబుల్ కొండలరావు కోర్టు మానిటరింగ్ బృందం సహకరించారు.

ఆటో డ్రైవర్ అసభ్య ప్రవర్తన.. పోక్సో కేసు నమోదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6 :ఆటోలో స్కూలుకు తీసుకు వెళ్తూ విద్యార్థిని పట్ల ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించడంతో అతనిపై ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన విద్యార్థిని నగరంలోని ఒక పాఠశాలలో చదువుతోంది. ఆటో డ్రైవర్ యాదం దుర్గారావు (28) వారం రోజుల నుంచి ఆ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఆటోలో వెళ్ళనని ఏడ్వడంతో తల్లి విషయం తెలుసుకుని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలంపురం కాల్వలో గుర్తుతెలియని మృతదేహం

పెంటపాడు, సెప్టెంబరు 6 :అలంపురం మిడ్‌లెవిల్ కాలువలో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహం కొట్టుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం మొత్తం పాడై గుర్తుపట్టని రీతిలో ఉందని ప్యాంటు ఉండటంతో పురుషుడిగా గుర్తించా మన్నారు. ప్రస్తుతం మృతదేహానికి తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

షాపులో చోరీ.. రూ.4 లక్షలు అపహరణ

కొయ్యలగూడెం, సెప్టెంబరు 6: మండలంలోని పొంగుటూరు గ్రామంలో వ్యాపార వేత్త కొల్లూరు సత్తిబాబు షాపులో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపులో ఉన్న రూ.4 లక్షల నగదును దొంగలు అపహరించారు. అంతే కాకుండా సీసీ కెమెరాల డేటా బాక్సును కూడా పట్టికెళ్ళారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సత్తిబాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 6: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నిట్టా మరియమ్మ (53) స్థానిక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వద్ద చిన్న హోటల్ నిర్వహిస్తోంది. దుకాణంలో ఉన్న ఫ్రిజ్ నుంచి పదార్థాలను బయటకు తీసుకునేందుకు డోర్‌ను పట్టుకోగా విద్యుత్ షాక్ కొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ఈమె కుటుంబ సభ్యులకు అక్కడి వారు సమాచారం ఇవ్వడంతో ద్వారకాతిరుమల పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు.

ఆటో బోల్తా..9 మంది కూలీలకు గాయాలు



నూజివీడు టౌన్, సెప్టెంబరు 6: జామ కాయల కోతకు కూలీలను తరలిస్తున్న ఆటో పల్టీ కొట్టిన ఘటనలో 9 మంది కూలీలు గాయాలపాలైన ఘటన నూజివీడులో చోటు చేసుకుంది. ఎమ్మార్ అప్పారావు కాలనీ నుంచి 9 మంది కూలీలతో వెళుతున్న ఆటో భారత్ క్లే ప్రోడక్ట్స్ వద్ద పల్టీ కొట్టడంతో రొంగలి చంద్రమ్మ, సప్పా నారాయణమ్మ, బల్లారమ్మ, రొంగలి పెద్దమ్మ, చిట్టూరి కోటేశ్వరమ్మ, ఉష, స్వర్ణమ్మ, షేక్ నాగూర్‌బీ, గౌరీలు గాయాల పాలయ్యారు. వీరిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పగలు హోటల్ నిర్వహణ..రాత్రి చోరీలు

మహిళ అరెస్టు
70 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6 :హోటల్ నిర్వహించడం వృత్తిగా కొనసాగిస్తున్న ఒక మహిళ తాళాలు వేసి ఉన్న ఇళ్ళల్లో చోరీలు చేయడం తన ప్రవృత్తిగా చేసుకుంది. చివరకు పోలీసులు నిఘా పెట్టి ఆమెను అరెస్టు చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ శుక్రవారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న మూడెడ్ల శ్రీదేవి (30) చిన్న హోటల్ నిర్వహిస్తున్నది. విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు దొంగతనాలు మార్గంగా ఎంచుకుంది. గత నెలలో అదే గ్రామంలో ఒక ఇంటికి తాళాలు వేసి ఉండగా ఆ ఇంటి తాళాలు పగులగొట్టి పది గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించింది. ఈ నెల మూడో తేదీన మరో ఇంటి తాళాలు పగులగొట్టి 60 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించింది. ఆ ప్రాంతంలో దొంగ తనాలు జరుగుతున్న సంఘటనపై భీమడోలు సీఐ రవికుమార్ పర్య వేక్షణలో ఎస్ఐ సుధాకర్, సిబ్బంది నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం గుండుగొలను గ్రామంలోని బెయిలీ బ్రిడ్జి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీదేవి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఆమె వద్ద 70 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తించారు. వాటి విలువ నాలుగు లక్షల 47 వేల రూపాయలని దీంతో ఆమెను అరెస్టు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నట్లుగా డీఎస్పీ చెప్పారు.

మా బిడ్డను బతికించండి

ప్రభుత్వాన్ని వేడుకుంటున్న తల్లిదండ్రులు
గుండె చుట్టూ పెరిగిన కండరాలు
శ్వాస తీసుకోవడం కష్టం కావడంతో అత్యవసర చికిత్స
వైద్యానికి రూ.7 లక్షల వరకు ఖర్చు


రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక గోగుల మౌనిక.. పక్కన (ఫైల్)

బుట్టాయగూడెం, సెప్టెంబరు 6 : ఈ చిన్నారి పేరు మౌనిక. వయసు 13 ఏళ్లు. ఊరు బుట్టాయగూడెం మండలం లంక పాకల. కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని లంకాలపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠ శాలలో ఎనిమిదో తరగతి చదు వుతోంది.బుధవారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా ఊపిరి తీసుకోవడం కష్టం కావడంతో తల్లిదండ్రులు ఆమెను రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. వైద్యులు పరీక్షించి గుండె చుట్టూ కండరాలు పెరగడంతో శ్వాస తీసుకోవడం కష్టంగా వుందని నిర్ధారించారు. ఆమెకు అత్యవసర వైద్యం అందించాలని, ఇందుకు 7 నుంచి 8 ఇంజక్షన్లు చేయాల్సి వుందని తేల్చి చెప్పారు. అయితే ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.90 వేల వరకు వుంటుందని స్పష్టం చేశారు. ఈ వైద్యానికి సుమారు ఐదు నుంచి ఏడు లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. అయితే అంత ఖర్చు పెట్టే స్థోమత తమకు లేదని కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు గోగుల చిన్నయ్య సంధ్య వాపోతున్నారు. కొండరెడ్లమైన తాము పాపే ప్రాణంగా బతుకు తున్నా మని, ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించి తమ బిడ్డకు ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించాలని కోరుతున్నారు. ఆదివాసీల కోసమే పనిచేస్తున్నామని చెప్పుకునే ఐటీడీఏ అధికారులు ఈ బిడ్డకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కారం రాఘవ డిమాండ్ చేశారు.

గణేశ్ విగ్రహాల వితరణ..

ఎమ్మెల్యే కామినేని 150 విగ్రహాల వితరణ



కైకలూరు, సెప్టెంబరు 6: చవితి పందిళ్లలో ఏర్పాటు చేసే గణనాథుడి విగ్రహాలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆర్థిక సాయం తో అందజేశారు. శుక్రవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా నుంచి నియోజకవర్గవ్యాప్తంగా 150 విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కైకలూరు మండలంలో 40 విగ్రహాలను అందించారు. వీటిని కూటమి నాయకులు పూల రామచంద్రావు, బలే ఏసురాజు, మంగినేని రామకృష్ణ, కొల్లి వరప్రసాద్, బూరుబోయిన శ్రీనివాసరావు, తోట లక్ష్మీ, శొంఠి రాజేశ్వరి తదితరులు అందజేశారు.

ముదినేపల్లి: ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వితరణతో ముదినేపల్లి మండలంలోని గణేష్ నవరాత్రుల నిర్వాహకులకు కూటమి నాయకులు వినాయకుడి విగ్రహాలను శుక్రవారం అందజేశారు. మండలంలో వివిధ గ్రామాలకు 30 విగ్రహాలను టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, నాయకులు పుట్టి లక్ష్మణస్వామి, బూరుబోయిన బాలాజీ, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ అడుసుమిల్లి సాయి కృష్ణ, నిర్వాహకులకు పంపిణీ చేశారు.



చాపరాల ఆధ్వర్యంలో..

మండవల్లి సెప్టెంబరు 6: మండవల్లి మం డలం భైరవ పట్నంలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు 40 వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కైకలూరు నియోజకవర్గ ఎన్డీయే నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, సజ్జా సురేష్‌బాబు ఆర్థిక సహాయంతో విగ్రహాల పంపిణీ చేశారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మండలంలోని 29 గ్రామాలకు విగ్రహాలకు అందించారు.

చాట్రాయిలో ఉపాధ్యాయ దంపతులు



చాట్రాయి, సెప్టెంబరు 6: చాట్రాయికి చెందిన ఉపాధ్యాయ దంపతులు తిరుపతిరావు, చంద్రకళ శుక్రవారం 116 మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో గత కొన్నేళ్లుగా వీరు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

మట్టి వినాయక విగ్రహాలు పంచిన జనసేన



నూజివీడు టౌన్, సెప్టెంబరు 6: పర్యావరణ హితంగా చవితిని నిర్వహించాలంటూ నూజివీడు జనసేన నాయకులు శుక్రవారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. నూజివీడు జనసేన కార్యాలయం వద్ద సమన్వయకర్త బర్మా ఫణిబాబు సూచనలతో 200 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. జనసేన నాయకులు తోట వెంకట్రావ్, బొబ్బిలి శ్రీకాంత్, పి. నాగబాబు, సూరిశెట్టి శివ, తదితరులు పాల్గొన్నారు.

సెంటినీ సిరామిక్స్ వితరణ



ముదినేపల్లి, సెప్టెంబరు 6 : ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామంలోని సెంటినీ సిరామిక్స్ కంపెనీ యాజమాన్యం కంపెనీ ఉద్యోగులు, గ్రామస్థులకు మట్టి గణేష్ ప్రతిమలను పంపిణీ చేసింది. శుక్రవారం కంపెనీ మేనేజర్ ప్రసాద్ మట్టి గణేష్ ప్రతిమలను అందజేసి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడే విధంగా మట్టి ప్రతిమలను పూజించాలని కోరారు. కంపెనీ టైమ్ ఆఫీస్ ఇన్‌చార్జ్ శ్యామలరావు పాల్గొన్నారు.

కొల్లేరు ఆగమాగం

(ఐదో పేజీ తరువాయి)

కొల్లేరును గడగడలాడిస్తోంది. ఇప్పటికే కోమటిలంక మార్గం కొట్టుకుపోయింది. పెనుమాకలంక మార్గం నీట మునిగింది. ఏలూరు-కైకలూరు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. దీనికి కొల్లేరు అంతర్భాగంలో పేరుకుపోయిన సిల్టు ఒక కారణమైతే కొల్లేరు ఆపరేషన్ తర్వాత కూడా కొంత భూభాగం ఆక్రమణ చెరలోనే ఉండడం మరో కారణం. ఒకానొక దశలో కొల్లేరు సరస్సులోకి పట్టిసీమ నుంచి వస్తున్న గోదావరి జలాలను తరలించాలని యోచించారు. కనీసం ఒక టీఎంసీ నీటిని పోలవరం కుడి కాల్వ నుంచి మళ్లిస్తే సరస్సులో నీటి నిల్వ ఉంటుంది, తద్వారా భూగర్భ జలాలు మెరుగవుతాయి, ఉప్పునీటి సాంద్రత తగ్గుముఖం పడుతుందని అంచనా వేశారు. కాని ఇప్పుడు బుడమేరు ఉరకలేస్తూ కొల్లేరుకు చేరడం చూసి అంతా కళ్ళు తేలేశారు. డజన్ల సంఖ్యలో లంక గ్రామాలు దాదాపు ఇప్పటికే నీటిలో చిక్కుకుపోయాయి. గడిచిన రెండు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టినందు వల్ల సరిపోయింది.. లేదంటే లంకలకు వెళ్ళే మార్గాలన్నీ ఇప్పటికే స్తంభించి పోయి ఉండేవి. కాగా బుడమేరు వరద నీరంతా కొల్లేరుకు చేరుతున్న తరుణంలో ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టారు. కొల్లేరులోకి చేరుతున్న నీరు ఉప్పుటేరు మీదుగా సముద్రంలోకి ఏ స్థాయిలో చేరుతుందో అంచనాకు వచ్చారు. అయినా అనుకున్నంత స్థాయిలో బుడమేరు వరద, ఇతర వాగుల వరద కొల్లేరు నుంచి దిగువకు అనుకున్నంతగా మళ్లకపో వడాన్ని గుర్తించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సైతం శుక్రవారం ఉప్పుటేరు ముఖద్వారాన్ని పరిశీలించారు. కొల్లేరు నుంచి ఉప్పుటేరులోకి చేరే నీరు తాము ఆశించినట్టుగా ఉందా, లేదా అనేది గమనించారు.


కొనుగోలుదారులతో కిక్కిరిసిన కైకలూరు సీతయ్య హోటల్ సెంటర్


మట్టి వినాయకుడికి పూజలు చేస్తున్న త్రివిధ విద్యార్థులు


నూజివీడు, కలిదిండిలో మండపాలు

శ్రీ గణనాథం..

- పూజలకు సిద్ధమవుతున్న గణనాథులు
- మండపాలు సిద్ధం చేసిన నిర్వాహకులు
- చుక్కలనంటిన పూజా సామగ్రి ధరలు
- వర్షంతో ఇబ్బందులు పడిన కొనుగోలుదారులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 6: గణపతి నవరాత్రుల నిర్వహణకు నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లో చలువ పందిళ్లు సిద్ధమయ్యాయి. ప్రధాన కూడళ్లలో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి విద్యుద్దీప కాంతులతో వైభవంగా నవరాత్రుల నిర్వహణకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. సుమారు 150కు పైగా ఈ ఏడాది నూజివీడు మండల, పట్టణ ప్రాంతాల్లో గణనాథులు కొలువు తీరనుండటం విశేషం. నూజివీడు పట్టణంలో వినాయక పత్రి, పండ్లు విక్రయాలు జోరుగా సాగాయి. ధరలు ఆకాశాన్నంటడం విశేషం.

ముసునూరు: మండలంలో చవితి ఉత్సవాలకు ఉత్సవ కమిటీలు సర్వం సిద్ధం చేశాయి. మండపాలను ఏర్పాటు చేసి సుందరంగా అలంకరించాయి. మండల వ్యాప్తంగా 16 గ్రామాల్లో సుమారు 150 మంది గణనాథులు పూజలకు సిద్ధమయ్యారు. పోలీస్ శాఖ ఆదేశాలతో నిబంధనల మేరకు నేటి నుంచి చవితి ఉత్సవాలు వైభవంగా జరగున్నాయి.

కలిదిండి: కలిదిండిలో 12 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించటానికి మండపాన్ని అందంగా ముస్తాబు చేశారు. మండలంలో సుమారు 400 విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారని సమాచారం. గత ఏడాది కంటే పూలు, పండ్లు, పూజా సామగ్రి రేట్లు ఎక్కువగా ఉన్నాయని మహిళలు అంటున్నారు.

ముదినేపల్లి : వినాయకుడి మట్టి విగ్రహాలతోపాటు వివిధ ఆకృతుల్లో గణేష్ విగ్రహాల అమ్మకాలతోపాటు వివిధ రకాల ప్రత్తి కొనుగోళ్లు జోరుగా జరిగాయి. కలువ పువ్వులకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. ముదినేపల్లిలో చవితి మార్కెట్ కోలాహలంగా కనిపించింది.

ముదినేపల్లి: గణేశ్ నవరాత్రులకు ముదినేపల్లి మండలం ముస్తాబవుతోంది. నిర్వాహకులు ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పెదగొన్నూరుకు చెందిన పెద్దిరాజు అనే శిల్పి తయారు చేసిన వినాయక విగ్రహాలకు డిమాండ్ ఎక్కువగా కనిపించింది. ఉత్సవాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ వెంకట్ కుమార్ సూచించారు.

భారీ వర్షంతో భక్తుల ఇబ్బందులు

కైకలూరు: కైకలూరులో కురిసిన భారీ వర్షానికి చవితికి పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. అమ్మకందారులు పత్రి, పూజా సామాగ్రి రేట్లను భారీగా పెంచేశారు. రాత్రి వరకు వర్షం కురుస్తుండడంతో ప్రజలు తడుస్తూనే పూజా సామగ్రిని కొనుగోలు చేశారు.

త్రివిధలో గణనాథుడికి పూజలు

నూజివీడు టౌన్: విఘ్నాలు తొలగించే గణనాథుడు పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా చూడాలని నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థులు స్వహస్తాలతో మట్టి గణనాథుడిని తయారు చేసి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సారథి

తక్షణం సాయమందాలి : మంత్రి

నూజివీడు, సెప్టెంబరు 6: వరదల కారణంగా దెబ్బతిన్న కుటుంబాలకు తక్షణమే సహాయ కార్యక్రమాలు అందించాలని, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రజలకు అందించే సహాయ కార్యక్రమాలపై మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నూజివీడు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. వరదల కారణంగా జరిగిన నష్టాలపై అంచనాలు రూపొందించాలని, పంట నష్టం, రహదారులు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయి. మైనర్, మేజర్ ఇరిగేషన్ వనరులకు జరిగిన నష్టం, దెబ్బతిన్న ఇళ్ళు తదితర వివరాలపై శాఖలవారీగా పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు కలిగిన నష్టాలపై కూడా వివరాలు అందించాలని ఆదేశించారు. రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సమావేశంలో రహదారులు, భవనాలశాఖ, పశుసంవర్ధక, రెవెన్యూ పంచాయతీ, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మండవల్లి: నుచ్చుమిల్లి గ్రామంలో వరదనీరు భారీగా చేరడంతో సమాచారం తెలుసుకున్న కైకలూరు నియోజకవర్గ కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, కొడాలి వినోద్, సజ్జా బాబి, నుచ్చుమిల్లిలో ముంపు ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. భయాందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చాపరాల భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కూడా ముంపు ప్రాంతాలను పరిశీలించారు.


నుచ్చుమిల్లిలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కూటమి నాయకులు

బాధితులకు తాగునీరు వితరణ

కైకలూరు: భారీ వర్షాలకు కైకలూరు వెలమపేట కాలనీ ముంపునకు గురికావడంతో శుక్రవారం కైకలూరుకు చెందిన వ్యాపారవేత్త గుర్రం శ్యాంకుమార్, గొల్లు బాబి ఆధ్వర్యంలో ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేశారు. ఇంటింటికి తాగునీటిని రెండు రోజులుగా అందజేస్తున్నారు. దాతలు ఔదార్యం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఉప్పుటేరు తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి: మండలంలో ఉప్పుటేరు తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఉప్పుటేరు తీర గ్రామాలైన సున్నంపూడి, దుంపలకోడు దిబ్బ వద్ద ఉప్పుటేరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరులో వరద నీరు ఉప్పుటేరులోకి రావటంతో ఉప్పుటేరు నీటి మట్టం పెరుగుతుందని ముంపు బాధితులను సున్నంపూడి పునరావాస కేంద్రాలకు తరలించాలని వీఆర్వోలను ఆదేశించారు. ఉప్పుటేరు గట్టు బలహీనంగా ఉన్న ప్రదేశాల్లో పటిష్ట పర్చాలన్నారు.


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, నాయకులు

పెద్ద చెరువుకు మరమ్మతులు

ముసునూరు, సెప్టెంబరు 6: మండలంలోని చెక్కపల్లిలో ప్రమాదకరంగా ఉన్న పెద్దచెరువు కట్టకు పడిన రంధ్రాన్ని పూడ్చారు. సర్పంచ్ రాధికా సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు 30 ట్రిప్పుల గ్రావెల్‌ను తరలించి, ఎక్స్‌కవేటర్‌తో రంధ్రం పూడ్చటంతోపాటు బలహీనంగా ఉన్న చోట గ్రావెల్‌తో బలోపేతం చేశారు. ఈ చెరువుకు సప్లై చానల్‌గా ఉన్న బసవరపుపాడు వాగులో వరద ప్రవాహం తగ్గింది. అయితే కట్ట బలహీనంగా ఉన్న చోట ఇసుక బస్తాలు, గ్రావెల్‌తో బలోపేతం చేశామని, చెరువుకట్ట తెగిపోయే అవకాశం లేదని, స్థానికులు భయపడవద్దని సర్పంచ్ అన్నారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి సుజాత, మాజీ ఉప సర్పంచ్ కాటేపల్లి సత్యనారాయణ పర్యవేక్షించారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

ముసునూరు, సెప్టెంబరు 6: పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య పనులను సర్పంచ్‌లు, కార్యదర్శుల ఆధ్వర్యంలో చేపట్టారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, రహదారులపై చేరిన చెత్తాచెదారం, మురుగునీటి నిల్వలను తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. వరదకు డ్రెయినేజీల్లో పేరుకున్న మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అక్కిరెడ్డిగూడెంలో సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, కార్యదర్శి విద్యాధరరావు పారిశుధ్య పనులను పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

చాట్రాయి, సెప్టెంబరు 6: జనార్దనవరంలో వైసీపీకి చెందిన బొద్దు వెంకటేశ్వరరావు తదితరులు తెలుగు మహిళా నాయకురాలు మాదాసు చంద్రకళ, స్థానిక నాయకులు వంగల సుబ్బారావు, పలగాని లక్ష్మీనారాయణ, నాగమల్లి వెంకటేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరుతున్నట్లు వారు చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

ముసునూరు, సెప్టెంబరు 6: నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎస్ఎంసీ చైర్మన్ నక్కా యోహాను, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్ అన్నారు. శుక్రవారం ముసునూరు జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఈ పాఠశాలలో వంట ఏజెన్సీపై విద్యార్థుల నుంచి ఫిర్యాదులు రావడంతో మరో ఏజెన్సీని ఎస్ఎంసీ కమిటీ ఆధ్వర్యంలో నియమించారు. వైస్ చైర్మన్ దీపిక, హెచ్ఎం సునీల, వార్డు సభ్యుడు రెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

చాట్రాయి, సెప్టెంబరు 6: మండలంలోని కృష్ణారావుపాలెం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్వాడీ పోషణ్ మాసోత్సవంలో భాగంగా పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారీ, తద్వారా చేకూరే ఆరోగ్య ప్రయోజనాలు గురించి వివరించారు. ఎంపీటీసీ సీహెచ్ వెంకటేశ్వర రావు, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఆటో బోల్తా.. 9 మంది కూలీలకు గాయాలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 6: జామకాయల కోతకు కూలీలను తరలిస్తున్న ఆటో బోల్తా పడిన ఘటనలో 9 మంది కూలీలు గాయాలపాలైన ఘటన నూజివీడులో చోటు చేసుకుంది. ఎమ్మార్ అప్పారావు కాలనీ నుంచి 9 మంది కూలీలతో వెళుతున్న ఆటో భారత్ క్లే ప్రొడక్ట్స్ వద్ద పల్టీ కొట్టడంతో రొంగలి చంద్రమ్మ, సప్పా నారాయణమ్మ, బల్లారమ్మ, రొంగలి పెద్దమ్మ, చిట్టూరి కోటేశ్వరమ్మ, ఉష, స్వర్ణమ్మ, షేక్ నాగూర్ బీ, గౌరీ గాయాల పాలయ్యారు. వీరిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో పశు వైద్యాధికారి మృతి


నాగేంద్ర వర్మ (ఫైల్)

కైకలూరు, సెప్టెంబరు 6: సీతనపల్లిలో పశువైద్యాధికారిగా పనిచేస్తున్న అల్లూరు నాగేంద్ర వర్మ (38) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురైన ఆయన చికిత్స పొందుతున్నారు. ఆకస్మికంగా గుండె పోటు రావడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. స్వగ్రామమైన భుజబలపట్నంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

టూరిజం ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల బెదిరింపు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 6: ట్రాయ్ నుంచి కాల్ చేస్తున్నాం మీరు ఢిల్లీలోని సిండికేట్ బ్యాంక్‌లో అనధికారికంగా అకౌంట్ ఓపెన్ చేయడమే కాక దానిని మిస్ యూజ్ చేశారు. ఈ నేరంలో మీపై ఇల్లీగల్ అడ్వటైజ్‌మెంట్ హరాస్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ పేరుతో కేసు నమోదైంది.. సీబీఐ నుంచి అరెస్టు వారెంట్ సైతం వచ్చింది. మీరు తక్షణం కోర్టు ఫీజుల కింద రూ.20 వేలు చెల్లించాలంటూ నూజివీడుకు చెందిన ఏపీ టూరిజం ఉద్యోగి వి.కిరణ్‌కుమార్‌కు బెదిరింపు ఫోన్ కాల్స్ రావడంతో అతడు నిర్ఘాంతపోయాడు. శుక్రవారం ఉదయం ఈ విధంగా ఫోన్ కాల్స్ రావడంతో ఆయన సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. కాగా కిరణ్‌తో ఫోన్ కాల్ మాట్లాడిన సైబర్ నేరగాళ్లు ఏకంగా వాట్సాప్‌లో కాల్ చేస్తూ అతడ్ని బెదిరించేందుకు సిద్ధపడ్డారు. ఈ విధంగా చేసేందుకు నేరగాళ్లు ఏకంగా పోలీస్‌స్టేషన్ సెట్‌నే ఏర్పాటు చేయడంతో తన ఆధార్, పాన్ కార్డులను ఎవరైనా దుర్వినియోగం చేసి ఉంటారనే అనుమానంతో వారు చెప్పిన నగదును చెల్లించేందుకు సిద్ధపడ్డాడు. తొలుత సైబర్ నేరగాళ్లు కోర్టు ఫీజుల కింద రూ. 20 వేలు చెల్లించాలన్నారు. తర్వాత రూ.7 వేలు చెల్లించాలని దిగిరావడంతో అనుమానం వచ్చిన అతను నగదును చెల్లించేందుకు నెట్‌లోకి వెళ్లి చూడగా సదరు నంబరు ఫ్రాడ్ అని రావడంతో ట్రాయ్ పేరుతో ఫోన్ చేసిన వాళ్లు సైబర్ నేరగాళ్లుగా గుర్తించాడు.

తాళాలు పగులగొట్టి చోరీ

ముదినేపల్లి, సెప్టెంబరు 6 : ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో ఓ రిటైర్డ్ హెచ్ఎం మారగాని మారయ్య ఇంట్లో చోరీ జరిగింది. ఆయన మూడు నెలలుగా అమెరికాలోని తన కుమారుడి వద్ద ఉంటున్నారు. ఇంటి తాళం పగులకొట్టి ఉండటాన్ని ఆయన పొలం కౌలుకు చేసే రైతు చూసి గ్రామంలోని మారయ్య బంధువులకు తెలపడంతో వారు ఇంటిలోకి వెళ్లి చూడగా మిక్సీ, ఇన్వర్టర్, బ్యాటరీ తదితర వస్తువులు అపహరించినట్లు పోలీసులకు తెలిపారు. సుమారు రూ.45 వేల విలువైన పరికరాలు పోయినట్లు గుర్తించారు. దీనిపై అమెరికా నుంచి మారయ్య ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు పంపారు.

బాధితులకు బాసటగా..

దాతల సహకారం మరువలేనిది : మంత్రి సారథి



నూజివీడు, సెప్టెంబరు 6: వరద బాధితులకు దాతల సహకారం మరువలేనిదని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆగిరిపల్లి మండలం చిన్నాగిరిపల్లికి చెందిన అమృత కుమార్ రూ.లక్ష, నూజివీడు పట్టణం లలిత జ్యూయలరీస్ వారు రూ.50 వేలను తాడిగడపలోని మంత్రి కార్యాలయంలో మంత్రి పార్థసారథిని కలిసి అందించారు. వరద బాధితులకు నూజివీడులోని ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు వేల సంఖ్యలో భోజన ప్యాకెట్లు తదితరాలను అందించటం అభినందనీయమన్నారు.

నెహ్రూపేట యువజన సంఘానికి మంత్రి అభినందన

నూజివీడు, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నూజివీడు నెహ్రూపేట యువజన సంఘం 150 కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపింది. ఒక్కో కుటుంబానికి ఐదు కేజీల బియ్యం, కేజీ పంచదార, ఉల్లిపాయలు, వంటనూనె తదితర సరుకుల కిట్‌లను అందచేసినట్లు వివరించారు. ఆపద సమయంలో తోటివారికి అండగా నిలవడం స్ఫూర్తిదాయకమని మంత్రి పార్థసారథి అభినందించారు.



ఆటో వర్కర్స్ యూనియన్ చేయూత

చాట్రాయి, సెప్టెంబరు 6: గృహ నిర్మాణశాఖ మంత్రి సారథి పిలుపునకు స్పందించిన చనుబండ కోదండరామా ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు, విజయవాడ వరద బాధితుల సహాయార్థం 130 కేజీలు బియ్యం, 20 కేజీల కంది పప్పు శుక్రవారం నూజివీడులోని మంత్రి కార్యాలయంలో అందజేశారు. మంత్రి కార్యాలయ సిబ్బంది అక్కడి నుంచి వీటిని విజయవాడ వరద బాధితులకు పంపించారు. యూనియన్‌ను మంత్రి పార్థసారథి అభినందించారు.

జనసేన నాయకుడి వితరణ



ముసునూరు, సెప్టెంబరు 6: వరద బాధితుల సహాయార్థం రమణక్కపేటకు చెందిన నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం నాగబాబు ఆర్థిక సాయం శుక్రవారం విజయవాడలో మంత్రి కొలుసు పార్థసారథికి రూ. 10 వేల చెక్కును అందజేశారు. విజయవాడలో వరద బాధితులకు నూజివీడు నియోజకవర్గంలో కూటమి శ్రేణులు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని మంత్రి సారథి పేర్కొన్నట్లు నాగబాబు తెలిపారు. జనసేన నాయకులు తోట వెంకట్రావ్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

బాధితులకు నెల జీతం విరాళమిస్తా : జయమంగళ

కైకలూరు, సెప్టెంబరు 6: ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తన ఒక నెల జీతాన్ని వరద బాధితుల సహాయార్థం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఫోన్ ద్వారా రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే తన నెల జీతాన్ని మంత్రి రవీంద్ర ద్వారా సీఎం చంద్రబాబుకు అందజేయనున్నట్లు జయమంగళ విలేకర్లకు తెలిపారు.

ఇంటింటికి వెళ్లి చిన్నారుల విరాళాల సేకరణ



చాట్రాయి, సెప్టెంబరు 6: వరద బాధితులను ఆదుకోటానికి చిన్నారులు మేము సైతం అంటూ విరాళాలు సేకరిస్తున్నారు. మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు హెచ్ఎం వెంకట్రావు, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ హసీనా ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్ళి విరాళాలు సేకరిస్తున్నారు. 5 రోజుల పాటు గ్రామంలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించి సీఎం సహాయనిధికి పంపుతామని హెచ్ఎం వెంకట్రావు చెప్పారు.

కలిదిండి శశి స్కూల్ రూ.60 వేలు విరాళం



కలిదిండి, సెప్టెంబరు 6 : కలిదిండి శశి స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి శుక్రవారం తహసీల్దార్ రామకృష్ణను కలసి వరద బాధితుల కోసం రూ.60 వేల చెక్కును విరాళంగా అందించారు. దీంతో ఆయన దాతలను అభినందించారు. కరస్పాండెంట్ జీవీ సత్యనారాయణ రాజు, ప్రిన్సిపాల్ పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల వితరణ



ముదినేపల్లి, సెప్టెంబరు 6 : విజయవాడలో వరద బాధితుల సహాయార్థం ముదినేపల్లి సహకార బ్యాంక్ పరిధిలోని 13 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సీఈవోలు, సిబ్బంది తమవంతు విరాళంగా వస్త్రాలు, పాలు, బిస్కెట్లు అందజేశారు. ముదినేపల్లి బ్యాంక్ బ్రాంచి మేనేజర్ కుమార్, సూపర్‌వైజర్ నాగభూషణం, పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పళ్లెం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అజిత్ సింగ్ నగర్‌లోని బాధితులకు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ ఆధ్వర్యంలో అందజేశారు.

9న టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

నూజివీడు, సెప్టెంబరు 6: ఉమ్మడి కృష్ణాజిల్లా టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 9వ తేదీన నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.సూర్యనారాయణ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి బాలబాలికల టెన్నికాయిట్ ఎంపికలను నిర్వహిస్తామని, ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16న శ్రీకాకుళం జిల్లా పలాస మండలం వజ్రపు కొత్తూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


కలిదిండిలో జలమయమైన ప్రధాన రహదారి

కలిదిండిలో భారీ వర్షం

కలిదిండి, సెప్టెంబరు 6 : కలిదిండిలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారి జలమయమైంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చవితి పూజా సామగ్రి కొనుగోలుకు కలిదిండి సెంటర్‌కు వచ్చిన ప్రజలు తడిసి ముద్దయ్యారు. చిరు వ్యాపారులు పలు అవస్థలు పడ్డారు. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవటంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.